ఉమాదేవికి స్వర్ణ కిరీటం



నిడమర్రు, న్యూస్‌టుడే: మండలపర్రులోని ఉమా నీలకంఠేశ్వరస్వామి క్షేత్రంలో అమ్మవారికి స్వర్ణ కిరీటం సమకూరింది. గ్రామస్థులు రూ.42 లక్షలు విరాళాలు సేకరించి, ఉమాదేవికి 500 గ్రాముల బంగారంతో కిరీటం చేయించారు. దీన్ని మంగళవారం అమ్మవారికి అలంకరించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

సిరుల తల్లీ.. కల్పవల్లీ



బలుసులమ్మ

తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలను పురస్కరించుకుని తాడేపల్లిగూడెం ఇలవేల్పు బలుసులమ్మ సోమవారం లక్ష్మీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉత్సవ కమిటీ సభ్యులు రూ.30 లక్షల నగదుతో అమ్మవారిని, ఆలయ ప్రాంగణాన్ని విశేషంగా అలంకరించారు.



కరెన్సీ నోట్ల అలంకరణలో ఆలయం ప్రాంగణం



కాత్యాయనిగా జంగారెడ్డిగూడెం వాసవీ కన్యకాపరమేశ్వరి

ఈనాడు ఏలూరు

మంగళవారం అక్టోబరు 8, 2024

'సదరం' పరీక్ష.. తప్పని ప్రయాస



సర్కారు అందించే దివ్యాంగ పింఛన్‌కు సదరం ధ్రువపత్రమే కీలకం. దీనికి సంబంధించి నిర్వహించే వైద్య పరీక్షలు ప్రహసనంగా మారుతున్నాయి. ఆన్‌లైన్‌లో నమోదు చేసుకుని, స్లాట్ ప్రకారం సంబంధిత వైద్యాలయాలకు వెళ్లినా..ప్రయాస తప్ప ప్రయోజనం లేని పరిస్థితి నెలకొంది.

తణుకు ప్రభుత్వ ఆసుపత్రిలో దరఖాస్తుదారుల నిరీక్షణ

నిర్దేశించిన సమయానికి వెళ్లినా నిరాశే

● ఏలూరుకు చెందిన ఓ వ్యక్తి వినికిడి సమస్యతో సదరం ధ్రువపత్రం కోసం దరఖాస్తు చేసుకున్నారు. తణుకు జిల్లా ఆసుపత్రిని ఎంపిక చేసుకుని, అక్కడకు వెళ్తే.. జంగారెడ్డిగూడెం నుంచి రేడియాలజిస్ట్ రావాల్సి ఉందని సిబ్బంది చెప్పారు. చివరకు పరీక్షలు చేయించుకోకుండానే వెనుదిరిగారు.

● రాజమహేంద్రవరానికి చెందిన ఓ దివ్యాంగుడు పోలవరం సీహెచ్‌సీలో స్లాట్ ఖాళీ ఉందని దరఖాస్తు చేసుకున్నారు. అక్కడకు వెళ్తే వైద్యుడు రాలేదు. ఎప్పుడు రావాలో సమాచారం ఇస్తాం అంటూ సిబ్బంది తాపీగా చెప్పారు. అక్కడకెళ్లిన 10 మంది దివ్యాంగులు నిరాశగా వెనుదిరిగారు. ఒకొక్కరికి రూ.700-1000 వరకు ఖర్చయిందని ఆవేదన వ్యక్తం చేశారు.

● గణపవరానికి చెందిన ఓ దివ్యాంగ మహిళ సదరం పరీక్షలకు భీమవరం ప్రాంతీయ ఆసుపత్రికి వెళ్లారు. సాయంత్రం వరకు కూర్చోబెట్టి సాయంత్రానికి ఆన్‌లైన్‌లో చూపించటం లేదని సాంకేతిక సమస్య అని చెప్పారు. ప్రత్యేక ఆటోలో రావడానికి రూ.500, ఇతర ఖర్చులు రూ.300 వరకు అయింది.

ఈనాడు, ఏలూరు, ఈనాడు డిజిటల్, భీమవరం

'సదరం' పరీక్షల నిర్వహణ లోపభూయిష్టంగా మారింది. దరఖాస్తుదారులు నెలల తరబడి నిరీక్షించి స్లాట్ బుక్ చేసుకున్నా..పరీక్షలు మాత్రం సాగటం లేదు. కొందరికి సాంకేతిక సమస్యల పేరుతో పరీక్షలు చేయడం లేదు. దరఖాస్తుదారులు నానాపాట్లు పడుతున్నారు.



ఉమ్మడి జిల్లాలో సదరం పరీక్షల వివరాలు

15	పరీక్షలు చేసే ఆసుపత్రులు
2000	స్లాట్ నిర్ధారణ అయినా పరీక్షల కోసం ఎదురు చూస్తున్న వారు
3	ఏటా దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉన్న స్లాట్లు
300	ఒక్కో స్లాట్‌కు అవకాశం ఉన్న దరఖాస్తుదారుల సంఖ్య
6	వైద్యులు, సిబ్బంది కొరత ఉన్న ఆసుపత్రులు

ఆచరణకు ఆపసోపాలు

సదరం శిబిరంలో పరీక్షలు చేయించుకోవడానికి అధికారులు నిర్దేశించిన సమయంలో స్లాట్లు బుక్ చేసుకోవాలి. ఎంపిక చేసుకున్న ఆసుపత్రికి వెళ్లి పరీక్షలు చేయించుకోవాలి. విధానం కాగితాల్లో బాగున్నా ఆచరణలో మాత్రం అధికారులు ఆపసోపాలు పడుతున్నారు.

✹ స్లాట్ ప్రకారం రోగులు వస్తున్నా వైద్యులు అందుబాటులో ఉండటం లేదు. పోలవరం, దెందులూరు, భీమడోలు పరిధిలో దివ్యాంగుల పరీక్షలు చేయాల్సి ఉన్నా వైద్యులు అందుబాటులో లేరు. చింతలపూడి, జంగారెడ్డిగూడెం, తాడేపల్లిగూడెం ఆసుపత్రుల నుంచి వైద్యులు వెళితే పరీక్షలు జరుగుతాయి. లేదంటే దరఖాస్తుదారులు కళ్లుకాయలు కాచేలా ఎదురు చూసి కాళ్లకు పని చెప్పాల్సిందే. పశ్చిమలో తణుకులో మాత్రమే వినికిడి పరీక్షలు చేస్తారు. దీంతో ప్రస్తుతం 700 మంది పరీక్షల తేదీ కోసం ఎదురు చూస్తున్నారు.

దీనిపై ఏలూరు, పశ్చిమ డీసీహెచ్‌ఎస్‌లు పాల్‌సతీశ్, సూర్యనారాయణ మాట్లాడుతూ వేగంగా పరీక్షలు నిర్వహించేలా చర్యలు తీసుకుంటామన్నారు.

వైద్య సేవల్లో లోపాలా..

- ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సమస్యలా
- నేడు డయల్ యువర్ డీఎంహెచ్‌వో



ఈనాడు మీతోడు

ఏలూరు టూటౌన్, న్యూస్‌టుడే: జిల్లాలో వైద్య సేవలు సరిగ్గా అందుతున్నాయా? వైద్యులు, సిబ్బంది సక్రమంగా పని చేస్తున్నారా, మన్యం ప్రాంతంలో జ్వరాల తీవ్రత.. వాటి కట్టడికి తీసుకుంటున్న చర్యలు, వైద్య శిబిరాల నిర్వహణ, వైరల్ జ్వరాలు, సీజనల్ వ్యాధులు తగ్గించేందుకు సిబ్బంది సక్రమంగా పని చేస్తున్నారా, ఫీవర్ సర్వే చేస్తున్నారా, డ్రై డే కార్యక్రమాల్లో పరిసరాల పరిశుభ్రతకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారా, డెంగీ జ్వరాలు ఎక్కువ నమోదైన సమయంలో కట్టడికి వైద్య ఆరోగ్య శాఖ తీసుకుంటున్న చర్యలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మందులు సక్రమంగా అందుతున్నాయా, సరిపడా ఉన్నాయా, రక్త పరీక్షలు సరిగా చేస్తున్నారా? ఇలా ఏవైనా సమస్యలున్నాయా... వీటన్నింటిపై నేరుగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి దృష్టికి తీసుకెళ్లే అవకాశాన్ని 'ఈనాడు' కల్పిస్తోంది. మీరు చేయాల్సిందల్లా ఒక్క ఫోన్ కాల్ మాత్రమే.

తేదీ 08.10.2024, మంగళవారం
సమయం ఉదయం 11 నుంచి 12 గంటల మధ్య
చరవాణి సంఖ్య 99496 23985

ప్రతి అర్జీని నిశితంగా పరిశీలించి పరిష్కరించండి

'మీ కోసం'లో 239 వినతులు



సమస్యలు తెలుసుకుంటున్న అధికారులు

ఏలూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కారానికి సోమవారం కలెక్టరేట్‌లో 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ'(మీకోసం) కార్యక్రమం నిర్వహించారు. సంయుక్త కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి, డీఆర్వో పుష్పమణి, జడ్పీ సీఈవో సుబ్బారావు, డీఆర్‌డీఏ పీడీ విజయరాజు, ఏలూరు ఆర్డీవో అచ్యుత అంబరీశ్, ఎస్‌డీసీ కె.భాస్కర్ పాల్గొన్నారు. జిల్లా నలుమూలల నుంచి ప్రజలు తరలివచ్చి 239 వినతులు అందజేశారు. జేసీ మాట్లాడుతూ.. 'మీ కోసం'లో అందిన ప్రతి అర్జీని నిశితంగా పరిశీలించి నిర్ణీత గడువులోపు పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

✦ లింగాలలోని సుబ్బయ్య చెరువు కాలుష్యమైంది. పశువులకు తాగేందుకు నీరు కూడా లేకుండా పోయింది. దీనిలో వ్యర్థాలు వేయకుండా చూడాలని మండవల్లి మండలానికి చెందిన నాంచారయ్య వినతి పత్రమిచ్చారు.

✦ కొప్పాకకు చెందిన ఓ వ్యక్తి మాంసం దుకాణాన్ని తన ఇంటి పక్కనే నిర్వహిస్తుండటంతో దుర్వాసన వస్తోందని సురేశ్‌బాబు ఫిర్యాదు చేశారు.

✦ తమ గ్రామంలో రామాలయం వద్ద ఓ వ్యక్తి రహదారిని ధ్వంసం చేస్తున్నాడని టి.నరసాపురం మండలం అల్లంచర్లరాజుపాలేనికి చెందిన విజయ రమేశ్ వినతి పత్రమిచ్చారు.

✦ ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన కింద జిల్లాలోని లబ్ధిదారులకు ఏలూరులోనే శిక్షణ ఇవ్వాలని విశ్వబ్రాహ్మణ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శివకేశవరావు విజ్ఞప్తి చేశారు.

✦ ఏలూరులో విలీనమైన ఏడు పంచాయతీల్లో పొలాలను ఇళ్ల స్థలాలుగా విభజించి విక్రయించిన ప్లాట్లలో ప్రజోపయోగ అవసరాలకు కేటాయించిన భూమి ఆక్రమణకు గురైంది. వీటిని తొలగించాలని భాజపా ఏలూరు నియోజకవర్గ కన్వీనరు జి.రాంబాబు కోరారు.

మద్యవర్తుల రాయబేరం!

వ్యాపారుల గూడుపుఠాణి



పాలకొల్లు, న్యూస్‌టుడే:

అయిదేళ్ల తర్వాత అమల్లోకి వచ్చిన కొత్త మద్యం పాలసీ వ్యాపారుల్లో కిక్కు పెంచింది. లాటరీలో మద్యం దుకాణం ఒకటి తగిలితే చాలు పరపతి పెంచుకోవచ్చనే పల్లెల నుంచి పట్టణాల వరకు ఉన్న చాలా మంది వ్యాపారుల భావన. ఆ అవకాశం దక్కించుకోవడానికి రాజకీయ నేతల నుంచి దిగువస్థాయి దళారుల వరకు ప్రస్తుతం ఎత్తుకు పైయెత్తులు వేస్తున్నారు. దరఖాస్తు దాఖలుకు మరో రెండు రోజులు మాత్రమే సమయం ఉండటంతో జిల్లాలో అనేక ఆసక్తికర పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. వ్యాపార వాంఛ రాజకీయ కాంక్షల మధ్య మద్యవర్తులు రాయబారం నడుపుతున్నారు.

నేతల వారసుల జోక్యం.. జిల్లాలోని ఇద్దరు ఎమ్మెల్యేల వారసులు మద్యం దరఖాస్తుల విషయంలో జోక్యం చేసుకుంటున్నట్లు తీవ్ర ప్రచారం జరుగుతుంది. వారికి తెలియకుండా దరఖాస్తులు చేయకూడదని హుకుం జారీ చేసినట్లు వ్యాపారులు వాపోతున్నారు. తీరప్రాంత నియోజకవర్గ ఎమ్మెల్యే ఒకరు కనీసం 10 దుకాణాలు తనకు వదిలేయాలని కోరుతున్నారు. మరో నేత అయితే తన పరిధిలోని దుకాణాలన్నింటిలోనూ 20 శాతం వాటా అడుగుతున్నారని చెబుతున్నారు. 10శాతానికైతే సరేనన్న సంకేతాలు మద్యవర్తుల ద్వారా చేరాయి. ఏదనేది తేలితే బుధవారం నాటికి దరఖాస్తుల వ్యవహారం పూర్తవుతుంది.

సిండికేట్లు ఏర్పాటు.. గతంలో రూ.50 వేలు మాత్రమే తిరిగిరాని డిపాజిట్ ఉండేది. ప్రస్తుతం ఆ మొత్తం రూ.2 లక్షలకు పెరగడంతో ఎక్కువ దరఖాస్తులు దాఖలు చేయలేకపోయామనే అయ్యేపనికాదని భావిస్తున్న వ్యాపారులు సిండికేటుగా ఏర్పడుతున్నారు. సిండికేటు నుంచి కనీసం 20 దరఖాస్తులకు తక్కువ కాకుండా వేయడానికి సిద్ధమయ్యారు. ఏ ఒక్కరికి లాటరీలో దుకాణం వచ్చినా అందరికీ వాటా లుండేలా ఒప్పందం చేసుకున్నారు. ప్రస్తుతం ప్రతిపక్షంలో ఉన్న నాయకులు సిండికేట్‌లో సభ్యులవుతున్నారు.

జాతకాల జోరు.. నలుగురైదుగురు కలిసి ఒక దరఖాస్తు వేయాలనుకునేవారు, సిండికేటు వ్యాపారుల్లో కొందరు జాతకాల ఆధారంగా దరఖాస్తులు చేస్తున్నారనే ఆసక్తికరమైనది. పేరు, నక్షత్రం బట్టి ఉన్నవారిలో ఎవరి జాతకం బలంగా ఉంటే వారి పేరిట దరఖాస్తు చేస్తున్నట్లు పాలకొల్లు, ఆచంట నియోజకవర్గాల్లో ఉన్నారు. జాతకం బాగుందనిపిస్తే ఆధార్, బ్యాంకు పుస్తకాలు తీసుకుని పెట్టుబడి పెట్టబోయినా ఆ పేరుతో దరఖాస్తు చేయడానికి కొందరు సిద్ధమయ్యారు.

వడ్డీలకు డబ్బుల్లేవు.. వడ్డీలకు డబ్బులిచ్చే వ్యాపారులు సైతం జిల్లాలో గత పది రోజులుగా కొత్త వ్యాపారం నిలిపేశారు. దరఖాస్తులు చేయడానికి ఆయా మొత్తాలను మళ్లించడంతోపాటు అధిక వడ్డీలకు వ్యాపారులు అప్పులు తీసుకెళ్లడంతో లావాదేవీలు ప్రస్తుతానికి నిలిచిపోయాయని పాలకొల్లుకు చెందిన వడ్డీ వ్యాపారి తెలిపారు. ఈనెలాఖరు వరకు వ్యాపారులది ఇదే పరిస్థితి ఉంటుందన్నారు.

రొయ్యల సాగుపై పరిశీలన

నెలాఖరులో యూఎస్ ఎఫ్‌డీఏ బృందం పర్యటన

ఈనాడు డిజిటల్, భీమవరం: వనామీ రొయ్యల సాగు విధానాన్ని పరిశీలించేందుకు అమెరికాకు చెందిన యునైటెడ్ స్టేట్స్ ఫుడ్ అండ్ డ్రగ్స్ అథారిటీ (యూఎస్ ఎఫ్‌డీఏ) పరిశోధన బృందం ఈ నెలాఖరులో పశ్చిమగోదావరి జిల్లాలో పర్యటించనున్నట్లు సమాచారం. ఏ చెరువును సందర్శిస్తారో, ఎక్కడ నమూనాలు సేకరిస్తారో ముందస్తు సమాచారం లేకుండానే ఈ బృందం తనిఖీలు చేపట్టనుంది. మేతలు, ప్రొబయాటిక్స్, వ్యాధి నివారణ మందులను పరిశీలించడంతో పాటు వాటిని విక్రయించే దుకాణదారులు, డీలర్లను కలవనున్నారు. సాగు పూర్తయిన తర్వాత ప్రాసెసింగ్, విక్రయాలపై కూడా అధ్యయనం చేయనున్నారు. అనంతరం గిడ్డంగుల నుంచి సరకును కాకినాడ, విశాఖపట్నం, చెన్నై పోర్టులకు ఏ విధంగా పంపిస్తున్నారనే విషయాలు తెలుసుకుంటారు. ఈ అంశంపై ఎంపెడా ఉప సంచాలకుడు కందన్‌ను వివరణ కోరగా ఆ బృందం పర్యటన ఉంటుందని నిర్ధారించారు. వారు ఎప్పుడు వచ్చేది ఎలాంటి సమాచారం లేదన్నారు.

నిర్వహణ గాలికి

జిల్లాలో తాడిపూడి కాలువ పొడవు	సాగునీరు లక్ష్యం	మండలాలు
19.125 కి.మీ.	63,300 ఎకరాలు	ఉంగుటూరు, భీమడోలు, ద్వారకాతిరుమల, దెందులూరు

- ✹ తాడిపూడి కాలువ పనులు పూర్తయ్యేదెప్పుడు?
- ✹ సాగునీటికి అన్నదాతల అవస్థలు



ద్వారకాతిరుమలలో అడవిని తలపిస్తున్న ప్రధాన కాలువ

ఉంగుటూరు, భీమడోలు, న్యూస్‌టుడే

20 ఏళ్ల క్రితం ప్రారంభించిన తాడిపూడి ఎత్తిపోతల పథకం నేటికీ కొలిక్కి రాకపోగా అసంపూర్తి పనులతో రైతులు అవస్థలు పడుతున్నారు. ఏటా ఒక పంటకి కూడా సాగు నీరు అందక నానా కష్టాలు పడుతున్నారు. దీంతో పథకం లక్ష్యం నీరుగారిపోతోంది. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని మెట్ట ప్రాంతాన్ని సస్యశ్యామలం చేయాలనే ఉద్దేశంతో 2004లో పథకాన్ని ప్రారంభించారు. 2.06 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలనే లక్ష్యంగా రూ.885.538 కోట్ల అంచనా వ్యయంతో 5 దశలుగా పనులు విభజించి నిర్మాణం చేపట్టారు. రెండు దశాబ్దాలు గడుస్తున్నా ప్రధాన కాలువ పనులు పూర్తికాలేదు. ప్రధాన కాలువ పొడవు 80.45 కి.మీ.తవ్వాలి. ఉపకాలువలు 31కి 14 మాత్రమే పూర్తయ్యాయి. సబ్‌లిఫ్టులు అయిదింటికి ఒకటి మాత్రమే పూర్తైయింది. ఇప్పటి వరకు రూ.626.974 కోట్లు ఖర్చైంది. తెదేపా ప్రభుత్వ హయాంలో 80 శాతం పనులు పూర్తయ్యాయి. ఏలూరు జిల్లాలో దెందులూరు, ద్వారకాతిరుమల మండలాల్లో అరకొరగా కాలువలు తవ్వడంతో రైతులు ఉపయోగం లేకుండా పోయింది.



ఉంగుటూరు మండలం గొల్లగూడెంలోని డీ-25 రెగ్యులేటర్‌కి గేట్లు బిగించలేదు. రెండు చోట్ల చెక్‌డ్యామ్‌లు పడిపోయాయి. వీటిని పట్టించుకునే నాథుడే లేడు.

✹ తాడిపూడి కాలువ నిర్వహణ అంతంతమాత్రంగానే ఉంది. పర్యవేక్షణ లేకపోవడంతో సాగునీటి కోసం అన్నదాతలు ఇబ్బందులు పడుతున్నారు. ఉంగుటూరు మండలంలోని నీలాద్రిపురం, గొల్లగూడెం, కంసాలిగుంట మీదుగా తాడిపూడి కాలువ ప్రవహిస్తోంది. దీనికి మూడు ఉప కాలువలు ఉన్నాయి. నిర్వహణ లేక అస్తవ్యస్తంగా మారింది. పోలసానిపల్లి ఎర్ర చెరువు వద్ద ఉప కాలువ ఆక్రమణకు గురైంది. భూసేకరణలో భాగంగా భూయజమానులు పరిహారం సరిపోదని కోర్టును ఆశ్రయించారు. కాలువ పనులు పూర్తి చేసేందుకు ప్రతిపాదనలు పంపించామని, నిధులు మంజూరు కాగానే పనుల ప్రారంభిస్తామని ఎస్‌ఈ దేవ ప్రకాశ్ తెలిపారు.

ఇసుక అక్రమ రవాణాను సహించం: జేసీ

ఏలూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలో ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే ఉపేక్షించమని జేసీ పి.ధాత్రిరెడ్డి హెచ్చరించారు. స్థానిక కలెక్టరేట్‌లో ఎస్పీ ప్రతాప్ శివకిశోర్‌తో కలిసి సోమవారం ఆమె పాత్రికేయులతో మాట్లాడారు. ఇసుక సరఫరాలో ఏవైనా ఇబ్బందులు ఎదురైతే కలెక్టరేట్‌లోని ఫెసిలిటీ కేంద్రంలో ఫిర్యాదు చేయవచ్చన్నారు. జిల్లాలో మరో నెల రోజులకు సరిపడా ఇసుక నిల్వలున్నాయన్నారు. గతంతో పోలిస్తే 300 అధికంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ కేసులు నమోదు చేశామన్నారు. మరో నెల రోజుల్లో పట్టిసీమ, గూటాల, గూటాల-1 ప్రాంతాల్లో ఇసుక రేవులు అందుబాటులోకి తెస్తామన్నారు. గత నెల 20 నుంచి ఉచిత ఇసుక విధానాన్ని ఏపీ శాండ్ మేనేజ్‌మెంట్ సిస్టం పోర్టల్ www.sand.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో అమలు చేస్తున్నారన్నారు. ఈ విధానంలో ఇసుకకు ఎలాంటి ధర వసూలు చేయడం లేదని, ప్రభుత్వం నిర్ణయించిన ధరల మేరకు రేవుల నిర్వహణ, రవాణా ఛార్జీలు మాత్రమే వసూలు చేస్తున్నామన్నారు. లారీలకు జీపీఎస్ అమర్చి అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేశామన్నారు. కుక్కునూరు మండలం ఇబ్రహీంపేట రేవులో ప్రస్తుతం 26 వేల టన్నుల నిల్వలున్నాయని ఆమె తెలిపారు. ఎస్పీ ప్రతాప్ శివకిశోర్ మాట్లాడుతూ.. ఉచిత ఇసుక విధానాన్ని ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం ద్వారా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. ఎక్కడైనా అక్రమాలుంటే 112 నంబరుకు ఫోను చేసి సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు.



మాట్లాడుతున్న ధాత్రిరెడ్డి. చిత్రంలో ఎస్పీ ప్రతాప్ శివకిశోర్

ఫెసిలిటీ కేంద్రంలోని ఫోను నంబర్లు

88865 42999, 95339 22444, 94930 40757, 80744 62376, 95504 34613, 78426 84296

టోల్‌ఫ్రీ నంబరు: 1800 425 6025

ల్యాండ్ లైన్ నంబరు: 08812-234014

విద్యతో పాటు వృత్తి శిక్షణ

దొంగిలిస్తూ.. జల్సాలు చేస్తూ..!

6 లో

ఆశలను అవకాశాలుగా మలుచుకునే సాధనమే సాంకేతికత

పకడ్బందీగా రవాణా శాఖ సేవలు



బాధ్యతలు తీసుకుంటున్న షేక్ కరీం

ఏలూరు వన్‌టౌన్, న్యూస్‌టుడే: జిల్లా వాసులకు రవాణా శాఖ సేవలను పకడ్బందీగా అందిస్తామని ఆ శాఖ ఉప కమిషనర్(డీటీసీ) షేక్ కరీం అన్నారు. ఏలూరులోని తన ఛాంబరులో సోమవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ డీటీసీగా పని చేస్తున్న ఎస్.శాంతకుమారి ఇటీవల కర్నూలు జిల్లాకు బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో గుంటూరు జిల్లా రవాణాశాఖ ఉప కమిషనర్‌గా విధులు నిర్వర్తిస్తున్న షేక్ కరీం ఏలూరు డీటీసీగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. అంతకుముందు ఏలూరు ఆర్టీవో కృష్ణారావు, ఎంవీఐలు, ఏఎంవీలు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు.

పోలీసు సిబ్బంది సంక్షేమానికి కృషి



అదనపు ఎస్పీ సూర్యచంద్రరావు

ఏలూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: పోలీసు సిబ్బంది సంక్షేమానికి తనవంతు కృషి చేస్తానని జిల్లా అదనపు ఎస్పీ(అడ్మిన్) నక్కా సూర్యచంద్రరావు అన్నారు. స్థానిక జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలోని తన ఛాంబరులో సోమవారం బాధ్యతలు స్వీకరించిన అనంతరం విలేకరులతో మాట్లాడారు. ఐజీ, ఎస్పీ సూచనలతో సిబ్బంది సమస్యల పరిష్కారానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామన్నారు. తదుపరి ఎస్పీ ప్రతాప్ శివకిశోర్, ఏలూరు రేంజి ఐజీ జీవీజీ అశోక్ కుమార్‌ను వేర్వేరుగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. అదనపు ఎస్పీని పలువురు డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలు మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు.

కాల్‌మనీ కేసులో ఇద్దరు అరెస్టు




వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రావణ్ కుమార్

ఏలూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: నగరంలో కొన్నాళ్లుగా అధిక వడ్డీలకు అప్పులిస్తూ ఖాళీ ప్రామిసరీ నోట్లు, చెక్కులు తీసుకుని ప్రజలను పీడిస్తున్న ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు డీఎస్పీ శ్రావణ్ కుమార్ తెలిపారు. స్థానిక ఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. ఏలూరుకు చెందిన మేడపాటి సుధాకర్‌రెడ్డి నగర పరిసర ప్రాంతాల్లో పలువురికి అధిక వడ్డీలకు పెద్ద మొత్తంలో అప్పులిచ్చాడు. నగదు తిరిగిరాబట్టే క్రమంలో వారిని శారీరకంగా, మానసికంగా ఇబ్బందులకు గురిచేశాడు. అతడితో పాటు గూడవల్లి విద్యాసాగర్, మహ్మద్ అఖిల్ రెహ్మాన్, రాజేశ్, లావణ్య, మరికొందరు అనుచరులు బాధితులపై దౌర్జన్యానికి పాల్పడేవారు. వారిపై ఇటీవల బాధితులు ఒకటో పట్టణ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు. రైల్వేస్టేషన్ సమీప సత్రంపాడు ఎంఆర్‌సీ కాలనీకి చెందిన గూడవల్లి విద్యాసాగర్, శనివారపుపేట జెండాచెట్టు ప్రాంతానికి చెందిన మహ్మద్ అఖిల్ రెహ్మాన్‌ను సోమవారం అరెస్టు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. సమావేశంలో ఒకటో పట్టణ సీఐ జి. సత్యనారాయణ, ఎస్సై మదీనాబాషా, సిబ్బంది పాల్గొన్నారు.

చనిపోయిన చోటే అంత్యక్రియలు!

శ్మశాన వాటిక లేక సాగిపాడు పునరావాస కాలనీ నిర్వాసితుల దైన్యం



పోలవరం, న్యూస్‌టుడే: పునరావాస కాలనీకి వచ్చి మూడేళ్లయ్యింది. కనీస వసతైన శ్మశాన వాటిక కోసం ఇంత వరకు స్థలం కేటాయించలేదు. ఎవరైనా చనిపోతే ఆ బాధ కన్నా అంత్యక్రియలు ఎక్కడ నిర్వహించాలన్న దుఃఖమే తమను బాధిస్తోందని బాధిత కుటుంబాలు వాపోతున్నాయి. ఈ దుస్థితి.. తూర్పుగోదావరి జిల్లా గోపాలపురం మండలం సాగిపాడు వద్ద పోలవరం మండలంలోని కొండ్రుకోట, మాధపురం, తూటిగుంట గ్రామాలకు చెందిన సుమారు 230 మంది గిరిజనేతర కుటుంబాలకు పునరావాసం కల్పించిన కాలనీలో నెలకొంది. స్థానికుడు దారం రామారావు అనే వ్యక్తి పోలవరంలోని కుమార్తె ఇంటికి వెళ్లి ఆదివారం రాత్రి చనిపోయాడు. అక్కడి నుంచి కాలనీకి తీసుకొచ్చి అంత్యక్రియలు చేసే పరిస్థితి లేకపోవడంతో అక్కడే కార్యక్రమాలు నిర్వహించారు. మరో వ్యక్తి తాళ్లూరి హరిబాబు మరణించగా.. కాలనీ సమీపంలోని కొవ్వాడ కాలువలో అంత్యక్రియలు ముగించినట్లు నిర్వాసితులు పేర్కొన్నారు.

20 మందికి పైగా.. గత మూడేళ్లలో ఆసుపత్రుల్లో, బంధువుల ఇళ్ల వద్ద, పునరావాస కాలనీలో 20 మందికి పైగా చనిపోయారు. చేతిలో సొమ్ము ఉన్న వారు పట్టిసీమ, వేగేశ్వరపురం, కొవ్వూరు తీసుకెళ్లి గోదావరిలో అంత్యక్రియలు నిర్వహించారు. అంత దూరం వెళ్లలేని వారు కొవ్వాడ కాలువలో శవాలను కలిపేశారు. ఇంకొందరికి ఎక్కడ చనిపోతే అక్కడే కార్యక్రమాలు నిర్వహించారు. శ్మశాన వాటిక స్థలం కోసం వైకాపా ప్రభుత్వ హయాంలో తహసీల్దార్లు, ఆర్డీవోలు, కలెక్టర్లు, పోలవరం ప్రాజెక్టు ప్రత్యేక కలెక్టర్లను కలిసి మొరపెట్టుకున్నా అదిగో ఇదిగో అన్నారే తప్ప.. ఇప్పటి వరకు మోక్షం కలగలేదని నిర్వాసితులు ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం తమ వారి సమాధులు చూసుకునే పరిస్థితి కూడా లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

‘టెట్’కు 332 మంది హాజరు

ఏలూరు విద్యా విభాగం, న్యూస్‌టుడే: ఏలూరు సమీప సిద్ధార్థ క్వెస్ట్ సీబీఎస్ఈ పాఠశాల కేంద్రంలో ‘ఉపాధ్యాయ అర్హత పరీక్ష’ (టెట్) కొనసాగుతున్నాయి. సోమవారం ఉదయం, మధ్యాహ్నం నిర్వహించిన పరీక్షకు 372కు 332 మంది అభ్యర్థులు హాజరయ్యారు. రెండు పూటల కలిపి 40 మంది గైర్హాజరయ్యారు.

విద్యతో పాటు వృత్తి శిక్షణ

ఐటీఐ విద్యార్థులకు 3 నెలల తర్ఫీదు



ఉండి, న్యూస్‌టుడే: విద్యతో పాటు ఉద్యోగ శిక్షణ (ఆన్ జాబ్ ట్రైనింగ్) కార్యక్రమం విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేస్తోంది. ఐటీఐలో ఎంపికున్న ట్రేడ్‌కు అనువైన ఉపాధి అవకాశాల సాధనకు మార్గం సుగమం చేస్తోంది. ఉండిలో ప్రభుత్వ ఐటీఐకి చెందిన పలువురు విద్యార్థులు ప్రస్తుతం ఉభయ తెలుగు రాష్ట్రాల్లో వివిధ కంపెనీలు/సంస్థల్లో ఈ శిక్షణ పొందుతున్నారు.


భృతి, ఉచిత వసతి.. ఉండి ప్రభుత్వ ఐటీఐలో కార్పెంటర్ స్థాయి సౌకర్యం ఉన్నాయి. ఈ విద్యా సంవత్సరంలో నూరు శాతం సీట్లు భర్తీ అయ్యాయి. కొన్ని ట్రేడ్‌ల్లో సీట్లు కేటాయించలేనంత స్థాయిలో దరఖాస్తులొచ్చాయి. ఇక్కడ చదివే విద్యార్థులు ఏటా మూడు నెలల పాటు ఆన్ జాబ్ ట్రైనింగ్ పొందాల్సి ఉంది. ఈ ఏడాది సెప్టెంబరు ఒకటో తేదీ నుంచి ఈ కార్యక్రమం ప్రారంభమైంది. తెలంగాణ రాష్ట్రం సంగారెడ్డి జిల్లా సదాశివపేటలోని కర్మాగారంలో ఎలక్ట్రీషియన్ ట్రేడ్ విద్యార్థులు 18 మంది శిక్షణ పొందుతున్నారు. అక్కడే ఇన్‌స్ట్రుమెంట్ మెకానిక్ విభాగంలో మరో 11 మంది చేరారు. గుంటూరులోని ఓల్టాస్ కంపెనీలో అయిదుగురు, ఎన్టీఆర్ జిల్లాలోని బ్యాస్పార్ కంపెనీలో ఆర్ అండ్ ఏసీ విభాగంలో 12 మంది నైపుణ్య శిక్షణ పొందుతున్నారు. ఫిట్టర్ విభాగంలో విజయవాడ, భీమవరం కంపెనీల్లో 15 మంది పని చేస్తున్నారు. రెండు రాష్ట్రాల్లో 72 మంది ఆన్ జాబ్ ట్రైనింగ్‌లో చేరారు. రెండు నెలల తర్వాత మరికొందరు వెళ్లేందుకు సిద్ధపడుతున్నారు. శిక్షణ కాలంలో వసతి, భోజనంతో పాటు కొంత భృతి అందిస్తూ ఆయా సంస్థలు చెల్లిస్తాయి. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు వాటిలోనే అప్రెంటిస్ అవకాశం ఉంటుందని ఉండి ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపల్ వేగేశ్న శ్రీనివాసరాజు తెలిపారు.



ఏసీకి మరమ్మతు చేస్తున్న ఐటీఐ విద్యార్థి

గాంధీ భవనాన్ని పర్యాటక కేంద్రంగా మార్చండి

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: నిడమర్రు మండలం పెదనిండ్రకొలనులోని మహాత్మాగాంధీ భవనాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని ఏపీ గాంధీ స్మారక నిధి ఛైర్మన్ కేవీ గాంధీ, కార్యదర్శి వై. రామచంద్రరావు విజ్ఞప్తి చేశారు. అమరావతిలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. విద్యా దాత మూర్తిరాజు నిర్మించిన గాంధీ భవనానికి చెందిన విలువైన ఆస్తులు అన్యాక్రాంతం అవుతున్నాయని, వాటిని పరిరక్షించాలని కోరారు. దీనిపై చంద్రబాబు సానుకూలంగా స్పందించారని, గాంధీ భవనాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దడానికి చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. అంతకుముందు విజయవాడ వరద బాధితుల సహాయార్థం రూ.5 లక్షల చెక్కు ముఖ్యమంత్రికి అందించినట్లు సర్వోదయ మండలి ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి బందు కూరి ప్రసాదరాజు ఒక ప్రకటనలో తెలిపారు.



ముఖ్యమంత్రికి రూ.5 లక్షల చెక్కు ఇస్తున్న కేవీ గాంధీ, రామచంద్రరావు

ఉద్యోగుల సమస్యలు పరిష్కారానికి వినతి

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఏపీ ఎన్జీవోల సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎ.విద్యాసాగర్ రవీంద్రబాబు, ఎం.అప్పలనాయుడు విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో ఎన్డీయే ప్రభుత్వం ఏర్పడిన ఉద్యోగులంతా ఆశించారు. త్వరలో జరగనున్న మంత్రి వర్గ సమావేశంలో ఉద్యోగులకు డీఏ, ఐఆర్ ప్రకటించాలని సోమవారం ఒక ప్రకటనలో కోరారు.

ఎన్ఎంఎంఎస్ దరఖాస్తు గడువు పెంపు

ఏలూరు విద్యా విభాగం, న్యూస్‌టుడే: ఎన్ఎంఎంఎస్ పరీక్ష దరఖాస్తు గడువును ఈ నెల 15వ తేదీ వరకు పెంచినట్లు డీఈవో ఎస్.అబ్రహం తెలిపారు. ప్రభుత్వ, జడ్పీ, పురపాలక, ఎయిడెడ్, మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలల్లో ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. కుటుంబం వార్షికాదాయం రూ.3.50 లక్షలలోపు ఉండాలన్నారు. మరిన్ని వివరాలకు ఏలూరులోని డీఈవో కార్యాలయంలో సంప్రదించాలని, లేదా www.bse.ap.gov.in వెబ్‌సైట్ చూడాలని సోమవారం ఒక ప్రకటనలో కోరారు.

ఆశలను అవకాశాలుగా మలుచుకునే సాధనమే సాంకేతికత

తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: ఆశలను అవకాశాలుగా మలుచుకునే సాధనమే ఆధునిక సాంకేతికత అని ఐపీఎస్ కన్సల్టెన్సీ లీడర్ సందీప్ చట్టి అన్నారు. స్థానిక ఏపీ నిట్ ప్రాంగణంలో రవీంద్ర కళావారతి ఆడిటోరియంలో సోమవారం టెడ్ ఎక్స్(టెక్నాలజీ, డిజైన్, ఎంటర్‌టైన్‌మెంట్) కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు వినూత్న ఆలోచనలు చేస్తూ సరికొత్తగా జీవించాలని సూచించారు. పారిశ్రామికవేత్త మెహర్ సాయి మాట్లాడుతూ దేశాభివృద్ధిని పరుగులు తీయించాల్సిన బాధ్యత యువతపై ఉందన్నారు. సొంతంగా కంపెనీలు ఏర్పాటు చేసి పది మందికి జీవనోపాధి కల్పించాలన్నారు. కార్యక్రమంలో ప్రముఖ బ్రెయిన్ కోచ్ జయసింహ, మాజీ ఐపీఎస్ అధికారి వివేక్ ఆత్రేయ, సినీ గాయకురాలు ఇంద్రావతి, రిజిస్ట్రార్ పి.దినేష్ శంకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ప్రముఖులతో నిట్ విద్యార్థులు

కూలీ ఆత్మహత్య

గణపవరం, న్యూస్‌టుడే: ఉరేసుకుని ఓ కూలీ ఆత్మహత్య చేసుకున్న ఘటన వెంకట్రాజపురంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన కాటం జీవరత్నం(38) పిప్పరలోని రొయ్యల చెరువులో పని చేస్తున్నాడు. ఆయన భార్య జనవరిలో చనిపోయారు. అప్పట్నుంచి మానసికంగా కుంగిపోయాడు. ఈ క్రమంలో చెరువు వద్దనున్న షెడ్డుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతునికి 13 ఏళ్ల కుమార్తె ఉంది. మృతుని సోదరుడు కాటం రమేష్ ఫిర్యాదు మేరకు ఎస్సై ఎ.మణికుమార్ కేసు నమోదు చేశారు.

విష గుళికలు తిని యువకుడు...

ఏలూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: విష గుళికలు తిని యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన గ్రామీణ మండలంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. జాలిపూడికి చెందిన మాత్రపు రవీంద్ర ప్రసాద్(30) మేకలు కాస్తుంటాడు. సోమవారం సాయంత్రం విష గుళికలు తిన్నాడు. స్థానికులు గమనించి ఏలూరు సర్వజన ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. గ్రామీణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

స్థిరాస్తి వ్యాపారి ఆస్తుల స్వాధీనం

ఏలూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: ఏలూరు నగరంలోని ప్రముఖ స్థిరాస్తి వ్యాపారి, ఓ ప్రజాప్రతినిధి దంపతుల ఆస్తులపై బ్యాంకు అధికారులు సోమవారం దాడులు చేపట్టారు. మొత్తం రూ.29 కోట్ల మేర బ్యాంకుల రుణాలు తీసుకుని, తిరిగి చెల్లించకపోవడంతో కన్సార్టియం నోటీసులు ఇస్తున్నారు. ఈ నేపథ్యంలో బ్యాంకర్లు న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో.. న్యాయమూర్తి ఆదేశానుసారం ఆస్తులు స్వాధీనం చేసుకునేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. సిటీ యూనియన్ బ్యాంక్ అధికారుల బృందం, చెన్నై నుంచి ప్రత్యేకంగా వచ్చిన ఓ డైరెక్టర్ దాడులు చేసి రెండు భవనాలు స్వాధీనం చేసుకున్నారు.



మాట్లాడుతున్న పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి గోపిమూర్తి

ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరిస్తా

ఏలూరు విద్యా విభాగం, న్యూస్‌టుడే: త్వరలో జరగనున్న ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనను గెలిపిస్తే మండలి వేదికగా ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి బి.గోపిమూర్తి అన్నారు. స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో సోమవారం పరిచయ కార్యక్రమం నిర్వహించారు. గోపిమూర్తి మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తిలోకి ప్రవేశించిన నాటి నుంచి ఇప్పటి వరకు ఉపాధ్యాయుల సమస్యలపై అనేక ఉద్యమాలు చేశానన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో మొదటి ప్రాధాన్య ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం నగరంలోని పలు సంఘాల నాయకులను కలిసి తనకు మద్దతు ఇవ్వాలని కోరారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ముస్తాఫా అలీ, ఆర్.రవి కుమార్, రాష్ట్ర కార్యదర్శి బి.సుభాషిణి, జిల్లా కార్యదర్శులు ఎన్.రాంబాబు, ఎస్.సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీల్లో ప్రతిభ

ఏలూరు విద్యా విభాగం, న్యూస్‌టుడే: ఎన్టీఆర్ జిల్లాలో జరిగిన రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ పోటీల్లో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన 11 మంది క్రీడాకారులు ప్రతిభ కనబరిచారు. టి.చరణ్ స్వర్ణం, బి.హిమవంశీకృష్ణ రజత పతకాలు సొంతం చేసుకున్నారు. బి.రత్న బాలాజీ, సి.హెచ్ పవన్, కె.సింధు, ఎస్.రూతమ్మ, టి.హాసిని, ఎం.గోపిక, జి.రేష్మప్రియ, ఎన్.రోజలీనా కాంస్య పతకాలు సాధించారు. విజేత క్రీడాకారులను స్థానిక జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో డీఈవో ఎస్.అబ్రహం, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి కె.అలివేలుమంగ సోమవారం అభినందించారు.



విజేత క్రీడాకారులతో డీఈవో అబ్రహం తదితరులు

పీహెచ్‌సీని సందర్శించిన కేంద్ర బృందం

పెదపాడు, న్యూస్‌టుడే: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కేంద్ర బృంద సభ్యులు డాక్టర్ సానఖ్రీన్, డాక్టర్ అమిన్ వసంత్ సోమవారం పరిశీలించారు. కేంద్ర ఆరోగ్య శాఖ ద్వారా అమలవుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించేందుకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. సిబ్బంది పనితీరును పరిశీలించి కేంద్రానికి నివేదిక అందిస్తారని వైద్యాధికారి డాక్టర్ చక్రధర్ తెలిపారు.

కాంగ్రెస్ కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలి

ఏలూరు తూర్పువీధి, న్యూస్‌టుడే: కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని పీసీసీ ప్రధాన కార్యదర్శి, ఏలూరు జిల్లా పరిశీలకుడు వింత సంజీవరెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక అగ్రహారంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో నియోజకవర్గ నాయకుల సమావేశం నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు రాజనాల రామ్మోహనరావు అధ్యక్షత వహించారు. సంజీవరెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పునర్వైభవం తీసుకొచ్చేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. నాయకులు గౌడ రంగబాబు, గుప్తా, రామ్మోహన్, సూర్య కాంతమ్మ, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

జల్సాల కోసం చోరీలు

ముగ్గురు పాత నేరస్థుల అరెస్టు

రూ.3.50 లక్షల విలువైన సొత్తు స్వాధీనం

జంగారెడ్డిగూడెం పట్టణం, న్యూస్‌టుడే: జల్సాలకు అలవాటు పడి దొంగతనాలను వృత్తిగా మార్చుకుని పలు నేరాలకు పాల్పడిన ముగ్గురు యువకులను జంగారెడ్డిగూడెం పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. వివరాలను స్థానిక పోలీస్ సర్కిల్ కార్యాలయంలో డీఎస్పీ యు.రవిచంద్ర వెల్లడించారు. పట్టణానికి చెందిన కోన శ్రీనివాసరావు అలియాస్ పెప్సీ నాని, విత్తనాల గణేశ్, దుర్గా సాంబశివలు పాత నేరస్థులు. వీరు ఈ ఏడాది అగస్టులో జంగారెడ్డిగూడెం అగ్నిమాపక కేంద్రం వద్ద మరమ్మతులకు గురైన ఆర్టీసీ బస్సు వద్ద చోదకుడిని కొట్టి అతడి చరవాణి లాక్కొనిపోయారు. స్థానిక కొడాలి వారి వీధి, కొయ్యలగూడెం మండలం నరసన్నపాలెం, ద్వారకాతిరుమలలో తాళం వేసిన ఇళ్లలో చోరీలకు పాల్పడ్డారు. అదే విధంగా జంగారెడ్డిగూడెంలో పలు చోట్ల నిలిపి ఉంచిన ద్విచక్ర వాహనాలు దొంగిలించారు. ముగ్గురు నిందితులపై గతంలో పలు కేసులు నమోదయ్యాయని.. వీరిని స్థానిక బుట్టాయగూడెం రోడ్డులో ఆదివారం రాత్రి ఎస్సై జబీర్ అదుపులోకి తీసుకున్నట్లు డీఎస్పీ చెప్పారు. నిందితుల నుంచి 17 గ్రాముల బంగారపు వస్తువులు, 123 గ్రాముల వెండి, ఓ చరవాణి, టీవీ, అయిదు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. మొత్తం చోరీ సొత్తు రూ. 3,50,000 ఉంటుందని.. నిందితులను చాకచక్యంగా పట్టుకోవడంలో కృషి చేసిన ఏఎస్సైలు ఎన్వీ సంపత్‌కుమార్, ఎన్.రాజేంద్ర, పీసీలు కె.సత్యనారాయణ, రాజశేఖర్‌లను డీఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.



నిందితుల అరెస్టు చూపుతూ వివరాల వెల్లడిస్తున్న డీఎస్పీ రవిచంద్ర

భవాని భక్తులను ఢీకొన్న ఆటో

ఒకరి మృతి, మరొకరికి గాయాలు

భీమడోలు, ఉంగుటూరు, న్యూస్‌టుడే: పూళ్ల- కైకరం గ్రామాల మధ్య సోమవారం రాత్రి రోడ్డు ప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో ఒకరు మృతి చెందగా, మరొకరికి గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు.. అంబేద్కర్ కోనసీమ జిల్లా మండపేట మండలం మాచవరానికి చెందిన భవాని భక్తులు పాదయాత్రగా విజయవాడ వెళ్తున్నారు. మార్గం మధ్యలోని కైకరం దాటాక వెనుక నుంచి వస్తున్న ఆటో ఢీకొంది. ప్రమాదంలో మల్లిడి ఆదిరెడ్డి(24) అక్కడికక్కడే మృతి చెందారు. మరో యువకుడు వెలగల శివ గాయపడ్డారు. క్షతగాత్రుడ్ని భీమడోలు సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు.

ఇద్దరు అంతర్రాష్ట్ర దోపిడీ దొంగల అరెస్టు

అశ్వారావుపేట గ్రామీణం, న్యూస్‌టుడే: ఇద్దరు అంతరాష్ట్ర దోపిడీ దొంగలను భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట పోలీసులు అరెస్టుచేసి వారి నుంచి రూ.4లక్షలకు పైగా విలువైన 50 గ్రాముల బంగారు ఆభరణాలను రికవరీ చేశారు. పాల్వంచ డీఎస్పీ సతీశ్‌కుమార్ వెల్లడించిన వివరాల ప్రకారం. . సోమవారం అశ్వారావుపేటలోని జంగారెడ్డిగూడెం రహదారిలో సీఐ కరుణాకర్, ఎస్సై యయాతిరాజు, సాయికిశోర్ రెడ్డి వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా ద్విచక్రవాహనంపై వెళ్తున్న కృష్ణా జిల్లా అవనిగడ్డ మండలం రామచంద్రాపురానికి చెందిన బచ్చు సతీశ్, ఎన్టీఆర్ జిల్లా రెడ్డిగూడెం మండలం మద్దులపర్వ గ్రామానికి చెందిన ఆరెంపుల ధర్మరాజు పోలీసులను చూసి కంగారుపడి పారిపోయేందుకు యత్నించారు. వారిని వెంబడించి పట్టుకుని విచారించగా పలు అంశాలు వెలుగులోకి వచ్చాయి.

పగలు రెక్కీ రాత్రి దొంగతనాలు రెండు తెలుగు రాష్ట్రాల్లో వీరు 15 దోపిడీ కేసులతోపాటు, ఒకరిని హత్య చేసిన ఘటనలో వీరిద్దరు నిందితులు. ఏలూరు జిల్లా చాట్రాయిలో దోపిడీ సమయంలో అడ్డొచ్చిన ఒకరిని హత్య చేసిన ఘటనలో జైలుకు వెళ్లి బెయిల్‌పై బయటకు వచ్చారు. అయినా వీరు దోపిడీలను ఆపలేదు. పగలు రెక్కీ నిర్వహించి రాత్రి సమయంలో దొంగతనాలకు పాల్పడతారని డీఎస్పీ వివరించారు. ఈ ఏడాది సెప్టెంబరు 10న అర్ధరాత్రి అశ్వారావుపేట మండలం నారంవారిగూడెం కాలనీలో రోడ్డు సమీపంలో నివాసం ఉంటున్న తుమ్మలపల్లి సత్యనారాయణపై దాడిచేసి తీవ్రంగా గాయపరిచి అతని భార్య కళావతి మెడలోని 18గ్రాముల బంగారం గొలుసును లాక్కెళ్లారు. ఫిబ్రవరి 15 రాత్రి దమ్మపేట మండలం మందలపల్లిలో దాబా హోటల్‌లో నిద్రిస్తున్న వృద్ధురాలు మందలపు సత్తెమ్మపై దాడిచేసి ఆమె మెడలోని బంగారం నానుతాడును లాక్కెళ్లారు. అదే నెలలో విశ్రాంత ఉపాధ్యాయుడు అంజయ్య దమ్మపేట బ్యాంకు నుంచి రూ.40వేలు తీసుకెళుతుండటాన్ని గమనించి అతనిపై దాడి చేసి దోపిడీ చేశారు. వీరిపై అశ్వారావుపేట పోలీసు స్టేషన్‌లో ఒకటి, దమ్మపేటలో మూడు, ఖమ్మం జిల్లా సత్తుపల్లిలో రెండు, వేంసూరులో రెండు, ఆంధ్రాలోని ఏలూరు జిల్లా చాట్రాయిలో మూడు, అవనిగడ్డ, రేపల్లె, విస్సన్నపేట, నూజివీడులో కేసులున్నాయి. నిందితులను కొత్తగూడెం కోర్టులో హాజరుపరచగా రిమాండు విధించారు.

బ్రాయిలర్ ధరలు (కృష్ణాజిల్లా)
(కిలో 1 కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -120 రిటైల్ ధర 142 చికెన్ విత్ స్కిన్ - 206, చికెన్ స్కిన్‌లెస్ - 234. అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 128, 137, 148 చికెన్ విత్ స్కిన్ - 250 చికెన్ స్కిన్‌లెస్ - 260.

నేటి నుంచి వార్డు సభ్యులకు శిక్షణ

ఉంగుటూరు, న్యూస్‌టుడే: స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో పంచాయతీల అభివృద్ధికి ప్రణాళికల రూపకల్పనపై ఉప సర్పంచులు, వార్డు సభ్యులకు మంగళ, బుధవారాల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు ఎంపీడీవో జి.రాజ్‌మనోజ్ తెలిపారు. ప్రతి పంచాయతీ నుంచి ఇద్దరు వార్డు సభ్యులు, ఉప సర్పంచి విధిగా హాజరు కావాలన్నారు. మండల వ్యాప్తంగా 81 మందికి శిక్షణ ఇస్తామని.. తాను, ఈవోపీఆర్డీ మాస్టర్ ట్రైనర్లుగా వ్యవహరిస్తామని ఎంపీడీవో సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

దెందులూరు: స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో మంగళ, బుధవారాల్లో వార్డు సభ్యులు, ఉప సర్పంచులకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో శ్రీదేవి తెలిపారు. గ్రామ పంచాయతీలకు సంబంధించి 10 అంశాలపై శిక్షణ ఇవ్వనున్నట్లు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఏలూరు

• ఏలూరు • దెందులూరు • ఉంగుటూరు

లిడ్‌క్యాప్ ఛైర్మన్‌కు అభినందన



ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: ఉండవల్లిలో లిడ్ క్యాప్ ఛైర్మన్ పి.మాణిక్యాలరావును తెదేపా రాష్ట్ర కార్యదర్శి దాసరి ఆంజనేయులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు మొక్క అందజేసి అభినందనలు తెలిపారు. తెదేపా బలోపేతానికి కష్టపడి పని చేసిన వారందరికీ పార్టీ తగిన గుర్తింపునిస్తోందన్నారు. అందుకు మాణిక్యాలరావే నిదర్శనమని ఆంజనేయులు చెప్పారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

ఏలూరు తూర్పువీధి: 80081 23847 | ఏలూరు గ్రామీణ: 80085 74535
పెదపాడు, పెదవేగి: 80085 74483 | ఉంగుటూరు: 79933 00492

ఏలూరు తూర్పువీధి, న్యూస్‌టుడే

సమస్య: పోణంగి రోడ్డు మరడాని రంగారావు కాలనీలోని తాగునీటి ట్యాంకు వద్దనున్న వీధి దీపం వారం రోజులుగా వెలగడం లేదు. రాత్రివేళ చీకట్లో రాకపోకలు సాగించలేకపోతున్నాం. **- వి.చంద్రరరావు, స్థానికుడు**

సమాధానం: సిబ్బందిని పంపి వీధి దీపానికి మరమ్మతులు చేయిస్తాం. **- కె.శేషగిరి, విద్యుత్తు ఏఈ**

సమస్య: తంగెళ్లమూడి కబాడీ కాలనీలోని యానాదుల వీధిలో కాలువలను శుభ్రం చేయడం లేదు. మురుగు పేరుకుపోయి దుర్వాసన వస్తోంది. రాత్రిళ్లు దోమల మోత భరించలేకున్నాం. **- నాగమణి, స్థానికురాలు**

సమాధానం: కాలువలో పూడిక తొలగించి, దోమల నివారణకు మందు పిచికారీ చేయిస్తాం. **- జి.చంద్రయ్య, నగరపాలక సహాయాధికారి**

సమస్య: అశోకనగర్ భాజపా కార్యాలయం వెనక రోడ్డులో నెలల తరబడి మురుగు కాలువలను శుభ్రం చేయలేదు. వాడుక నీరు ముందుకెళ్లక దుర్గంధం వస్తోంది. **- శ్రీనివాసరావు, అశోకనగర్ మొదటి రోడ్డు**

సమాధానం: పారిశుద్ధ్య సిబ్బందిని పంపి కాలువలో పూడిక తీయిస్తాం. **- భానుప్రతాప్, నగరపాలక అధికారి**

స్పందనకు వందనం

వ్యర్థాల తొలగింపు.. **ఏలూరు తూర్పువీధి, న్యూస్‌టుడే:** శాంతినగర్ ఎనిమిదో రోడ్డులో ఎట్టకేలకు వ్యర్థాలు తొలగించి శుభ్రం చేశారు. కాలనీలో కొన్నాళ్లుగా చెత్తాచెదారాలు పేరుకుపోవడంపై 'మేమున్నాం.. మీకు తోడుగా'లో ఈ నెల 5న వార్త ప్రచురితమైంది. నగరపాలక సహాయాధికారి జి.చంద్రయ్య స్పందించి సిబ్బందితో చెత్తాచెదారాలు తొలగించి శుభ్రం చేయించారు.

కాలువలో పూడికతీత.. ఏలూరు వెన్నవెల్లివారిపేట నుంచి టీచర్స్ కాలనీకి వెళ్లే రోడ్డులోని మురుగు కాలువలో పూడిక తీయించారు. కాలువలో నెలల తరబడి పూడిక తీయకపోవడంపై ఈ నెల 4న ప్రచురితమైన వార్తకు నగరపాలక ఉప అధికారి శివారెడ్డి స్పందించారు. సిబ్బందిని పంపి పూడిక తీయించి, దోమల నివారణకు మందు పిచికారీ చేయించారు.

ఆదాయం ఘనం... వసతులు కనం!

మార్కెట్ యార్డులో సమస్యల తిష్ఠ

దెందులూరు, న్యూస్‌టుడే

దెందులూరు వ్యవసాయ మార్కెట్ యార్డులో సమస్యలు తిష్ఠ వేశాయి. దెందులూరు మార్కెట్ కమిటీకి అత్యధిక ఆదాయం వస్తోంది. యార్డులో నిమ్మకాయల వ్యాపారం నిర్వహిస్తారు. యార్డుకు నిమ్మకాయలు తీసుకొచ్చే రైతులు, వీటిని కొనుగోలు చేసే వ్యాపారులు, సరకు ఎగుమతి, దిగుమతి చేసే హమాలీలు వందలాది మంది వచ్చి వెళ్తుంటారు. మార్కెట్ కమిటీకి ఏడాదికి రూ.5 కోట్లు ఆదాయం లభిస్తుండగా... కనీస వసతులు మాత్రం లేవు.

వేధిస్తున్న తాగునీటి ఎద్దడి..

యార్డులో ప్రత్యేక తాగునీటి వసతి లేదు. రూ.30 లక్షల అంచనాతో ఓవర్ హెడ్ ట్యాంకు నిర్మాణానికి గత ప్రభుత్వ హయాంలో 2021లో అప్పటి ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి శంకుస్థాపన చేశారు. పనులు దక్కించుకున్న గుత్తేదారు ట్యాంకు నిర్మాణం చేశారు. సకాలంలో బిల్లులు తాలుకా సొమ్ములు అందక పోవడంతో గుత్తేదారు పైపులైను విస్తరణ తదితర పనులు చేయకుండా అసంపూర్తిగా వదిలేశారు. తాగునీటికి మార్కెట్ కమిటీ అధికారులు అరకొరగా నీళ్ల సీసాలు ఏర్పాటు చేస్తున్నారు. చాలీచాలని సీసాలతో తాగునీటికి ఇబ్బందులు పడుతున్నామని రైతులు, వ్యాపారులు, హమాలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేసవిలో పరిస్థితి మరింత దారుణంగా ఉంటుందంటున్నారు.



నిరుపయోగంగా ఓవర్‌హెడ్ ట్యాంకు

విశ్రాంతి గదుల్లేవు..

యార్డుకు నిమ్మకాయలు తీసుకొచ్చే రైతులు, సరకు ఎగుమతి దిగుమతి చేసే హమాలీలు, క్రయ విక్రయాలు చేసే వ్యాపారులకు కనీసం విశ్రాంతి గదులు లేక అవస్థలు పడుతున్నారు. వీరికి తక్కువ ధరకు అల్పాహారం, భోజన సదుపాయం కల్పించే క్యాంటీన్ లేదు. వేసవి సీజన్ సమయంలో అల్పాహారం, భోజనానికి ఇబ్బందులు పడుతున్నారు.

వెతలు తీరుస్తాం

మార్కెట్ యార్డులో సమస్యలు పరిష్కారానికి చర్యలు చేపడుతున్నాం. పైపులైను విస్తరణ పనులు చేయించి ఓవర్‌హెడ్ ట్యాంకును వినియోగంలోకి తీసుకొస్తాం. తద్వారా తాగునీటి సమస్య పరిష్కరిస్తాం.

- శ్రీనివాసరావు, ఉన్నత శ్రేణి కార్యదర్శి, దెందులూరు మార్కెట్ కమిటీ

ఏవీఎస్ కన్వీనరుగా రోహిత్



ఏలూరు విద్యా విభాగం, న్యూస్‌టుడే: ఆంధ్ర విద్యార్థి సంఘం(ఏవీఎస్) ఏలూరు నియోజకవర్గ కన్వీనరుగా రోహిత్ నియమితులైనట్లు ఆ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.అశోక్ రెడ్డి సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా రోహిత్ మాట్లాడుతూ... నియోజకవర్గంలోని విద్యార్థుల సమస్యల పరిష్కారానికి, విద్యారంగం బలోపేతానికి కృషి చేస్తానని చెప్పారు.

నియోజకవర్గ అధ్యక్షుడిగా గరికిపాటి



నియామక పత్రం అందుకుంటున్న సూర్యప్రకాశ్

నిడమర్రు, న్యూస్‌టుడే: రాష్ట్ర కాపు, బలిజ సంక్షేమ సేన ఎగ్జిక్యూటివ్ కమిటీ ఉంగుటూరు నియోజకవర్గ అధ్యక్షుడిగా నిడమర్రు మండలం చానమిల్లికి చెందిన గరికిపాటి సత్యసాయి సూర్యప్రకాశ్ నియమితులయ్యారు. ఆయనకు బొలిశెట్టి సత్య, పుప్పాల శ్రీనివాస్ నియామక పత్రం అందజేశారు. నియోజకవర్గంలో కాపు, బలిజల సంక్షేమానికి కృషి చేస్తానని సూర్యప్రకాశ్ తెలిపారు.

ప్రజా సంక్షేమానికి ఎన్టీఆర్ ఆద్యుడు: ఎమ్మెల్యే



దెందులూరు: విగ్రహావిష్కరణలో ప్రభాకర్, నాయకులు

దెందులూరు న్యూస్‌టుడే: ప్రజా సంక్షేమానికి నాంది పలికిన మహనీయుడు నందమూరి తారక రామారావు అని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ కొనియాడారు. దెందులూరులో ఎన్టీఆర్ కాంస్య విగ్రహాన్ని సోమవారం ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. పేదలకు రూ.2కే కిలో బియ్యం, పింఛన్ల పంపిణీ తదితర ప్రజాహిత పథకాలకు ఎన్టీఆర్ శ్రీకారం చుట్టారని గుర్తుచేశారు.

పెదవేగి: ప్రజా సమస్యల తక్షణ పరిష్కారానికే 'మీ కోసం' నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో సోమవారం మీ కోసం కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. దీర్ఘకాలిక సమస్య పరిష్కారానికి అధికారులు చొరవ చూపాలన్నారు. అంతకుముందు ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఇన్‌ఛార్జి తహసీల్దారు భ్రమరాంబ, ఎంపీడీవో శ్రీనివాస్, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రజలందరికీ అందుబాటులో ఉంటా: బడేటి



ఎమ్మెల్యే చంటిని సత్కరిస్తున్న ముస్లిం మత పెద్దలు

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: నియోజకవర్గంలోని ప్రజలందరికీ ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. ఎన్డీయే అధికారంలోకి వచ్చి వంద రోజులు పూర్తయిన నేపథ్యంలో... స్థానిక ఏఎస్ఆర్ మైదానం సమీప షాదీఖానాలో ముస్లిం యువత సోమవారం అభినందన సభ నిర్వహించారు. ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ముస్లిం యూత్ ట్రస్టు ఏర్పాటుకు రూ.లక్ష విరాళం ఇస్తానని ప్రకటించారు. అనంతరం ఆయన్ను ఘనంగా సత్కరించారు. నగరపాలక సంస్థ కో-ఆప్షన్ సభ్యుడు పెదబాబు, ఎండీ జబీవుల్లా, అబ్దుల్ రజాక్, ఎండీ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

ఏలూరు గ్రామీణ: స్థానిక అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజా దర్బార్ నిర్వహించారు. ఎమ్మెల్యే బడేటి చంటి పాల్గొని ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ... ప్రజల వినతులను పరిశీలించి సత్వరమే పరిష్కారం చూపాలని అధికారులను ఆదేశించారు. మొత్తం 15 మంది వివిధ సమస్య పరిష్కారానికి వినతులు అందజేశారని తహసీల్దార్ శేషగిరి తెలిపారు.

మండల వనరుల సమన్వయకర్తగా రాజేశ్



ఉంగుటూరు, న్యూస్‌టుడే: గ్రామీణ నీటిపారుదల, పారిశుద్ధ్యం, స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ విభాగం మండల వనరుల సమన్వయ కర్త(ఎంఆర్పీ)గా తల్లిబోయిన రాజేశ్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. తొలుత ఎంపీడీవో రాజ్‌మనోజ్‌ను కలిసి నియామక పత్రం అందజేశారు. గతంలో వైకాపా ప్రభుత్వం ఎంఆర్పీలను తొలగించగా... వారంతా న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఎమ్మార్పీలను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని న్యాయస్థానం ఆదేశించింది. తదనుగుణంగా ఎన్డీయే ప్రభుత్వం వీరిని విధుల్లోకి తీసుకుంది.

పట్టణారోగ్య కేంద్రాల్లో మెరుగైన సేవలు



సిబ్బందికి సూచనలిస్తున్న గోవిందరావు

ఏలూరు టూటౌన్, న్యూస్‌టుడే: పట్టణారోగ్య కేంద్రాల్లో రోగులకు మెరుగైన వైద్య సేవలందిస్తున్నారని మలేరియా సహాయాధికారి గోవిందరావు అన్నారు. స్థానిక లంబాడీపేటలోని పట్టణారోగ్య కేంద్రాన్ని సోమవారం సందర్శించారు. అక్కడికొచ్చిన రోగులతో మాట్లాడారు. ఈ కేంద్రాల్లో 63 రకాల రక్త పరీక్షలు చేస్తారన్నారు. డెంగీ, మలేరియా, టైఫాయిడ్, ప్లేట్‌లెట్స్, కఫం, కొలెస్ట్రాల్ తదితర పరీక్షలు చేసి మందులు అందజేస్తారన్నారు. అవకాశాన్ని నగరవాసులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

సమాజాభివృద్ధిలో భాగస్వాములు కండి



విద్యార్థినికి నగదు ఇస్తున్న సంస్థ ప్రతినిధులు

ఏలూరు వన్‌టౌన్, న్యూస్‌టుడే: దానాల్లోకెల్లా విద్యాదానం గొప్పదని.. దాతల నుంచి సాయం పొందిన విద్యార్థులు బాగా చదువుకొని సమాజాభివృద్ధిలో భాగస్వాములు కావాలని మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ మండల ఛైర్‌పర్సన్ అడుసుమిల్లి నిర్మల అన్నారు. ఏలూరులో ఇరువురు ప్రతిభావంతులైన పేద విద్యార్థినులకు సోమవారం ఆర్థికసాయం అందజేశారు. ఆమె మాట్లాడుతూ.. నందిన వర్షిత, కూర్మా సంధ్యలు ఇంటర్‌లో 90 శాతం మార్కులతో ఉత్తీర్ణులై, ప్రస్తుతం ఇంజినీరింగ్ చదువుతున్నారన్నారు. ఆర్థిక ఇబ్బందులతో ఇబ్బందులు పడుతున్న వారికి అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఇంజినీరుగా పని చేస్తున్న నర్రా వసుమతి, మాగంటి శ్రీవల్లి రూ.30 వేలు ఆర్థికసాయం అందించారన్నారు. ఈ సాయాన్ని సద్వినియోగం చేసుకొని విద్యార్థినులు గొప్ప స్థాయికి ఎదగాలని ఆమె ఆకాంక్షించారు. కమిటీ ఛైర్మన్ మేతర అజయ్‌బాబు, వెంకటలక్ష్మి, సుబ్బమ్మ, ఉదయ్, శ్రీనివాసరావు, కనకదుర్గ, రవికుమార్, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

దెందులూరు ఎంపీడీవోగా శ్రీదేవి



దెందులూరు, న్యూస్‌టుడే: దెందులూరు ఎంపీడీవోగా కె.శ్రీదేవి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈమెకు కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు చెప్పారు. మండలాభివృద్ధికి తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని శ్రీదేవి తెలిపారు.

ఆలయాల ఈవోగా చిన నాగేశ్వరరావు



ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: స్థానిక అగ్రహారంలోని జనార్దనస్వామి, కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానాల ఈవోగా సీహెచ్‌వీ చిన నాగేశ్వరరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఈవోగా విధులు నిర్వర్తిస్తున్న జి.రామ పెద్దింట్లు పోడూరుకు బదిలీ అయ్యారు.

ప్రమాదంలో ఒకరికి గాయాలు

గొల్లగూడెం(ఉంగుటూరు), న్యూస్‌టుడే: లారీని ద్విచక్ర వాహనం ఢీకొన్న ఘటన చేబ్రోలు- దూబచర్ల మార్గంలో సోమవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. చేబ్రోలుకు చెందిన జగన్నాథ పవన్‌కుమార్ ద్విచక్ర వాహనంపై దూబచర్ల వైపు వెళ్తున్నారు. మార్గం మధ్యలోని గొల్లగూడెం వద్ద వాహనం అదుపు తప్పి ఎదురుగా వస్తున్న లారీని ఢీకొంది. ప్రమాదంలో పవన్ కుమార్‌కు గాయాలయ్యాయి. క్షతగాత్రుడ్ని తాడేపల్లిగూడెం ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు.

దౌర్జన్యంపై ఫిర్యాదు.. ముగ్గురిపై కేసు

ఏలూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: ఓ వ్యక్తిపై దౌర్జన్యం చేసేందుకు యత్నించిన ఘటనలో సర్పంచితోపాటు మరో ఇద్దరిపై కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు... చాటపర్రు గ్రామ సొసైటీ ఆదాయ వాటాను ఆర్నెల్లుగా ఎస్సీ కాలనీకి ఇవ్వకపోవడంపై స్థానికుడు బొడ్డు కనకరాజు సర్పంచి గుడిపూడి రఘును నిలదీశారు. అతడిపై కక్ష గట్టిన సర్పంచి ఈ నెల 6న రాత్రి మరో ఇద్దరితో కలిసి దౌర్జన్యం చేశాడు. బాధితుడి ఫిర్యాదుతో గ్రామీణ పోలీసులు సోమవారం రాత్రి కేసు నమోదు చేశారు.

ఇంటి తాళాలు పగులగొట్టి చోరీ

ఏలూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: స్థానిక మొండూరువారి వీధికి చెందిన ఓ ఇంటి యజమాని 4 నెలల కిందట ఛత్తీస్‌గఢ్ వెళ్లారు. గుర్తుతెలియని వ్యక్తులు ఇంటి తలుపు తాళాలు పగులగొట్టి చోరీకి పాల్పడ్డారు. విషయం తెలుసుకున్న యజమాని బంధువు కాంతాలక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేశారు. రెండో పట్టణ పోలీసులు సోమవారం రాత్రి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

కట్నం తేవాలని వేధింపులు

నీలాద్రిపురం (ఉంగుటూరు), న్యూస్‌టుడే: అదనపు కట్నం తేవాలని భార్యను వేధిస్తున్న భర్త, అత్తపై కేసు నమోదు చేసినట్లు చేబ్రోలు పోలీసులు తెలిపారు. వారి కథనం మేరకు.. నీలాద్రిపురానికి చెందిన పాలుబోయిన శ్రీనివాసరావుకు ఎనిమిదేళ్ల క్రితం అదే గ్రామానికి చెందిన పద్మతో వివాహమైంది. వ్యసనాలకు బానిసైన శ్రీనివాసరావు భార్యతో తరచూ గొడవపడేవాడు. ఆమె అత్త రాధ అదనపు కట్నం తేవాలంటూ ఒత్తిడి చేసేవారు. పెద్దల సమక్షంలో పంచాయితీ పెట్టినా, ఫలితం లేకుండా పోయింది. ఈ నెల 4న మద్యం మత్తులో శ్రీనివాసరావు భార్యతో మళ్లీ గొడవపడి కొట్టాడు. దీంతో ఆమె తన సోదరుడు బొట్టా దుర్గాప్రసాద్‌ను పిలిపించగా- అతడిపైనా దాడి చేశాడు. క్షతగాత్రులను తాడేపల్లిగూడెం ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు. పద్మ ఫిర్యాదు మేరకు శ్రీనివాసరావు, రాధలపై పోలీసులు కేసు నమోదు చేశారు.



ఏలూరు: అంబికాదేవి | ఏలూరు: కనకదుర్గమ్మ | ఏలూరు: శాకంబరీదేవిగా.. | పెదపాడు: రాట్నాలమ్మ | పెదపాడు: మహాలక్ష్మిగా.. | ఉంగుటూరు: చల్లాలమ్మ | గణపవరం: రాజరాజేశ్వరీదేవిగా..

శర్వాయ.. శ్రద్ధాయ

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు నయనానందకరంగా సాగుతున్నాయి. అయిదో రోజు సోమవారం అమ్మవార్లు మహాచండీ దేవి అలంకరణలో భక్తులను కటాక్షించారు. మహిళలు పెద్ద సంఖ్యలో ఆలయాలకు తరలివచ్చి, శక్తిరూపిణులను దర్శించి తరించారు. ఏలూరు సత్రంపాడులోని అంబికాదేవి, సౌభాగ్యలక్ష్మీదేవి, గంగా పార్వతీ సమేత రేవులింగేశ్వరస్వామి, శనివారపుపేటలోని కనకదుర్గమ్మను మహా చండీదేవిగా సర్వాంగ సుందరంగా అలంకరించారు. బావిశెట్టివారి పేట, అగ్రహారం, దొండపాడు, తూర్పు వీధిలోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు చేశారు. గణపవరం బస్టాండ్ కూడలి, పిప్పర, బాలయ్యచెరువులోని కనకదుర్గమ్మలను భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకున్నారు. పెదవేగి మండలం రాట్నాలకుంట, పెదపాడు మండలం కొత్తూరులోని అమ్మవార్లను మహాలక్ష్ములుగా తీర్చిదిద్దారు. ఉంగుటూరు మండలం నారాయణపురం, కైకరం, చేబ్రోలు, వెల్లమిల్లి, గొల్లగూడెం, నాచుగుంట, ఉంగుటూరు గ్రామాల్లోని అమ్మవార్లను వివిధ రూపాల్లో అలంకరించారు. నిడమర్రు మండలం మందలపర్రులో ఉమా నీలకంఠేశ్వరస్వామి పంచాయతన క్షేత్రంలో అమ్మవారిని మహాచండీదేవిగా అలంకరించారు. ● కైకరం పడమర వీధి ఆరుగుళ్లు కూడలిలోని అమ్మవారిని మహాచండీ దేవీగా అలంకరించారు. ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు, తెదేపా జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు, జనసేన నాయకుడు వట్టి పవన్‌కుమార్ దర్శించి మొక్కులు తీర్చుకున్నారు. **- న్యూస్‌టుడే బృందం**



ఉంగుటూరు: అమ్మవారిని దర్శించిన ఎమ్మెల్యే పత్సమట్ల, గన్ని

అఖిలపక్ష నాయకులతో సమావేశం

దెందులూరు, న్యూస్‌టుడే: స్థానిక తహసీల్దారు కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీ నాయకులతో ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ భాస్కర్ సోమవారం సమావేశమయ్యారు. ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో నాయకులకు పలు సూచనలు చేశారు. తహసీల్దార్ సుమతి, తెదేపా, వైకాపా, జనసేన, భాజపా నాయకులు పాల్గొన్నారు.

రైతుల అభ్యున్నతికి తోడ్పాటు

పెదపాడు, న్యూస్‌టుడే: రైతుల అభ్యున్నతికి ప్రభుత్వం తోడ్పాటునందిస్తోందని జిల్లా వ్యవసాయాధికారి ఎస్‌కే హబీబ్ బాషా అన్నారు. కొక్కిరపాడు పంచాయతీ వేంపాడులో ఈ-పంట నమోదు ప్రక్రియను సోమవారం రైతులతో కలిసి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వ ఆదేశానుసారం పూర్తి స్థాయిలో ఈ-పంట నమోదును పరిశీలించామన్నారు. రైతుల పేర్లు, పంటలు తదితర వివరాలు సమగ్రంగా ఉన్నాయా.. లేదానని తెలుసుకున్నామన్నారు. ఆయన వెంట ఏడీఏ వై.సుబ్బారావు, మండల వ్యవసాయాధికారి వానపల్లి ప్రదీప్‌కుమార్, రైతులు ఉన్నారు.

10 మందికి జరిమానా

ఏలూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: మద్యం తాగి వాహనాలు నడిపిన 10 మందికి న్యాయస్థానం జరిమానా విధించింది. ట్రాఫిక్ పోలీసుల కథనం మేరకు... స్థానిక డీఎస్పీ శ్రావణ్ కుమార్ ఆదేశానుసారం ట్రాఫిక్ ఎస్సై రంగారావు, సార్జెంట్ వెంకటేశ్ తమ సిబ్బందితో కలిసి ఈ నెల 6న రాత్రి గూడ్‌షెడ్డు రోడ్డులో వాహన తనిఖీలు చేపట్టారు. శ్వాస నిర్ధారణ పరీక్షల్లో 10 మంది మద్యం తాగినట్లు తేలడంతో వారిపై కేసులు నమోదు చేశారు. సోమవారం ఏలూరు న్యాయస్థానంలో హాజరుపరచగా.. న్యాయమూర్తికి అందరికీ కలిపి రూ.32,300 జరిమానా విధించారు. అంతకుముందు ట్రాఫిక్ పోలీసుస్టేషన్ వద్ద మందుబాబులకు ఎస్సైలు కౌన్సెలింగ్ ఇచ్చారు.

23 నుంచి అన్నదాన సమాజం భిక్ష



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సభ్యులు

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: స్థానిక రామకోటి ప్రాంగణంలో అన్నపూర్ణ సహిత హరిహరపుత్ర అయ్యప్పస్వామి అన్నదాన సమాజంవారి భిక్ష కార్యక్రమం ఈ నెల 23 నుంచి ప్రారంభమవుతుందని సమాజం అధ్యక్షుడు కొట్టు మధు తెలిపారు. రామకోటి ప్రాంగణంలో సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. 23న ఉదయం గణపతిహోమం, పూజాదికాలు చేసినానంతరం భిక్షా ప్రారంభమవుతుందన్నారు. డిసెంబరు 16 వరకు కొనసాగుతుందన్నారు. రోజూ 2 వేల మందికి భిక్ష ఉంటుందన్నారు. అవకాశాన్ని స్వాములు సద్వినియోగం చేసుకొని... అన్నప్రసాదాలు స్వీకరించాలని ఆయన కోరారు. అంతకుముందు రామాలయంలో స్వామి, అమ్మవార్లకు సమాజ సభ్యులు పూజలు చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

పాలస్తీనాపై దాడులు హేయం

ఏలూరు వన్‌టౌన్, న్యూస్‌టుడే: పాలస్తీనా ప్రజలపై ఇజ్రాయెల్ క్షిపణులతో విరుచుకుపడటం హేయమని వామపక్ష నాయకులు అన్నారు. స్థానిక పాత బస్టాండ్ కూడలిలో పాలస్తీనాకు సంఘీభావంగా సోమవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. సీపీఐ, సీపీఎం, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శులు మన్నవ కృష్ణచైతన్య, ఎ.రవి, బద్దా వెంకట్రావు మాట్లాడుతూ... అమెరికా ఆర్థిక సంక్షోభం నుంచి బయటపడేందుకు యుద్ధాలను ప్రేరేపిస్తోందని మండిపడ్డారు. అమెరికా సామ్రాజ్యవాద విధానాలకు వ్యతిరేకంగా ప్రజలంతా పోరాడాలని వారు పిలుపునిచ్చారు. నాయకులు ఎర్రా శ్రీనివాసరావు, అప్పారావు, రత్నం, నాని, క్రాంతి, జాను, వీరినాయుడు, కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

ఏలూరు సినిమాలు

ఏలూరు వన్‌టౌన్, న్యూస్‌టుడే

అంబిక డీలక్స్	కమిటీ కుర్రోళ్లు
అంబిక మినీ	రామనగర్ బన్నీ
సాయిబాలాజీ	కాళీ
బాలాజీ	శ్వాగ్
సత్యనారాయణ స్క్రీన్ 1	సత్యంసుందరం
సత్యనారాయణ స్క్రీన్ 2	మత్తు వదలరా 2
విజయలక్ష్మి వీమ్యాక్స్ 1	ఉత్సవం
విజయలక్ష్మి వీమ్యాక్స్ 2	35 చిన్న కథ కాదు
విజయలక్ష్మి వీమ్యాక్స్ 3	గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైం
ఎస్‌వీసీ మల్టీప్లెక్స్ స్క్రీన్ 1	శ్వాగ్
ఎస్‌వీసీ మల్టీప్లెక్స్ స్క్రీన్ 2	గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైం
ఎస్‌వీసీ మల్టీప్లెక్స్ స్క్రీన్ 3	ఏఆర్ఎం
ఎస్‌వీసీ మల్టీప్లెక్స్ స్క్రీన్ 4	మత్తు వదలరా 2

'దుమ్ము' లేచిపోద్ది!



పెదవేగి - కూచింపూడి మీదుగా బాదరాల వెళ్లే ప్రధాన రహదారి గుంతలమయంగా మారింది. దీనికితోడు కొన్నిచోట్ల కోతకు గురైంది. తహసీల్దారు కార్యాలయం నుంచి న్యాయంపల్లి అడ్డరోడ్డు వరకు అంచులు దెబ్బతినడంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. రహదారిని పరిశీలించి, గోతులు పూడ్చించేందుకు చర్యలు తీసుకుంటామని ర.భ.శాఖ మండల ఏఈ బలరాం తెలిపారు. **- న్యూస్‌టుడే, పెదవేగి**

వరద బాధితులకు చేయూత

కైకలూరు, న్యూస్‌టుడే: ప్రజలకు ఎటువంటి కష్టం వచ్చినా నందమూరి కథానాయకులతో పాటు అభిమాన సంఘం అండగా ఉంటుందని ఆల్ ఇండియా ఎన్‌బీకే అభిమాన సంఘం అధ్యక్షుడు బీబీజీ తిలక్ అన్నారు. నియోజకవర్గ ఎన్‌బీకే- ఎన్టీఆర్ అభిమాన సంఘం ఆధ్వర్యంలో ఏలూరు గ్రామీణ మండలం కోమటిలంకలో వరద బాధిత కుటుంబాలకు బియ్యం, నిత్యావసర సరకులు సోమవారం పంపిణీ చేశారు. అంతకు ముందు కైకలూరులోని కలిదిండి కూడలిలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు వేగిరెడ్డి సురేశ్, ఎల్ఆర్ మోహన్, సర్పంచి యోహాన్ పాల్గొన్నారు.

కాలువ కనుమరుగు!



నిడమర్రులో రహదారి వెంబడి ఉన్న ప్రభుత్వ భూములతో పాటు పంట బోదెలూ ఆక్రమణలకు గురవుతున్నాయి. నిడమర్రు నుంచి నిడమర్రు కాలనీకి మధ్య సుమారు కిలోమీటరు దూరముంది. రోడ్డు వెంబడి పంట బోదె ఉండగా.. చేపల చెరువుల యజమానులు ఆక్రమించి పూడ్చేస్తున్నారు. క్షేత్ర స్థాయిలో కాలువను పరిశీలించి చర్యలు తీసుకుంటామని జలవనరుల శాఖ ఏఈ గునుపూడి రాము తెలిపారు. **- న్యూస్‌టుడే, నిడమర్రు గ్రామీణం**

పోలవరం

•పోలవరం •చింతలపూడి

రాయితీపై విత్తనాలు

టి.నరసాపురం, న్యూస్‌టుడే: పశు పోషకులకు రాయితీపై అయిదు కిలోల గ్రాసం (జొన్న)విత్తనాలు రూ.115కు ఇస్తున్నట్లు మండల పశు వైద్యాధికారి కోటేశ్వరరావు తెలిపారు. ఎస్సీ, ఎస్టీ పాడి రైతులకు పశుపుల దాణాను రాయితీపై 200 కిలోలు (బస్తాలు) రూ.1,300కు అందిస్తున్నట్లు పేర్కొన్నారు.

అక్రమంగా నిల్వ చేస్తే కఠిన చర్యలు

టి.నరసాపురం, న్యూస్‌టుడే: దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని ఎవరైనా బాణసంచా అక్రమంగా నిల్వ ఉంచితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై ఎ.జయబాబు అన్నారు. టి.నరసాపురంలో సోమవారం ఆయన మాట్లాడుతూ అనుమతులు లేకుండా బాణసంచా కలిగి ఉన్నా, విక్రయాలు జరిపినా చర్యలు తప్పవని హెచ్చరించారు.

‘ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి’

బుట్టాయగూడెం, న్యూస్‌టుడే: మన్యం ప్రాంతాల్లో పనిచేస్తున్న గిరిజన సంక్షేమశాఖ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని ఏపీ గిరిజన సంక్షేమ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర వర్కింగ్ కమిటీ అధ్యక్షుడు పాయం పోశయ్య కోరారు. ఈ మేరకు విజయవాడలో గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి కన్నబాబు, డైరెక్టర్ భార్గవిలను సోమవారం కలిసి సంఘం ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా రెగ్యులర్ కాంట్రాక్ట్ రెసిడెన్షియల్ టీచర్లు (సీఆర్‌టీ)ను రెగ్యులర్ చేయాలని కోరారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు కంగాల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

చింతలపూడి పట్టణం, న్యూస్‌టుడే

సమస్య: చింతలపూడి మండలం యర్రగుంటపల్లి ఎస్సీ కాలనీలో మురుగు కాలువలు లేక నీరు నివాసాల మధ్య నిలుస్తోంది. దుర్వాసన, దోమల బెడదతో ఇబ్బందులు పడుతున్నాం.

\- కుమార్, స్థానికుడు

సమాధానం: దోమల నివారణకు మందు పిచికారీ చేస్తాం. మురుగు ప్రవహించేలా చర్యలు తీసుకుంటాం.

\- మురళీకృష్ణ, ఎంపీడీవో

అల్ప విద్యుత్తు సమస్య పరిష్కారానికి వినతి



అర్జీలు పరిశీలిస్తున్న ఆర్డీవో అద్దయ్య

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: పట్టణంలోని శ్రీరామ్‌నగర్‌లో అల్ప విద్యుత్తు సమస్య పరిష్కరించాలని కోరుతూ సోమవారం ఆర్డీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో చల్లగాని వరలక్ష్మి అనే మహిళ ఆర్డీవో అద్దయ్యకు ఫిర్యాదు చేశారు. ప్రజల నుంచి ఆర్డీవో అర్జీలు స్వీకరించారు. కొయ్యలగూడెంలో విద్యుత్తు షిఫ్ట్ ఆపరేటర్ అక్రమంగా తీసుకున్న నగదు ఇప్పించాలని అంకాలగూడెనికి చెందిన పి.లక్ష్మణరావు, పుల్లేపూడిలోని తనకున్న 1.33 ఎకరాల భూమి రికార్డుల్లో తప్పుగా నమోదైందని, సరిచేయాలని కేవీ ఎస్ఆర్ మధు, కొయ్యలగూడెం మండలం ఏడువాడలగూడెంలో ప్రభుత్వ భూమిని ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని నల్లమోను వెంకటలక్ష్మయ్య, మక్కినవారిగూడెంలో ఆక్రమించి కడుతున్న దుకాణాల నిర్మాణాలను ఆపాలని విజయకుమార్‌లు విన్నవించారు.

సవరణల పత్రాలు సమర్పించండి

కొయ్యలగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: ఓటర్ల జాబితాల్లో సవరణలకు సంబంధించిన దరఖాస్తులు అందజేయాలని జంగారెడ్డిగూడెం ఆర్డీవో కె. అద్దయ్య సూచించారు. కొయ్యలగూడెం తహసీల్దార్ కార్యాలయం వద్ద వివిధ రాజకీయ పార్టీల నాయకులతో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి సమావేశంలో సోమవారం ఆయన పాల్గొన్నారు. ఇప్పటికే ఉన్న పోలింగ్ కేంద్రాల పునర్వ్యవస్థీకరణ, కొత్త ఓటర్ల చేర్పు, వివరాల మార్పు, చేర్పులు తదితర అంశాలపై వివరించారు.

ఓటరుగా నమోదుకు నవంబరు 6 వరకు అవకాశం

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఓటరుగా నమోదయ్యేందుకు నవంబరు 6 వరకు అవకాశం ఉందని తహసీల్దార్ స్లీవజోజి తెలిపారు. పట్టభద్రులైన వారు 18, ఉపాధ్యాయులైతే 19ను అందించాల్సిన్నారు.

వృద్ధులకు వైద్య సేవలు

కొయ్యలగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: ఆరోగ్య పరిరక్షణలో వృద్ధుల ఆరోగ్యమూ ముఖ్యమని బయ్యనగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి వి.సత్యనారాయణ అన్నారు. గ్రామంలో ఆరోగ్య ఉపకేంద్రం పరిధిలోని వృద్ధులకు సోమవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వృద్ధాప్యంలో వచ్చే ఆరోగ్య సమస్యలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. పలువురిని పరీక్షించి అవసరమైన మందులు అందజేశారు.

ఉద్యాన సాగుకు ఊతం!

రాయితీలు, ప్రోత్సాహకాలతో రైతులకు తప్పనున్న పెట్టుబడి కష్టాలు

చింతలపూడి, న్యూస్‌టుడే

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఉపాధి హామీ పథకంలో ఉద్యాన పంటల సాగుకు ప్రాధాన్యం ఇవ్వడంతో రైతులకు ఈ పథకం కొండంత అండగా నిలవనుంది. జిల్లాలోనే అత్యధికంగా చింతలపూడి నియోజకవర్గంలో ఉద్యాన పంటల సాగు ఎక్కువ. ఆయిల్‌పామ్, మామిడి, నిమ్మ, తైవాన్ జామ సాగులో ఉంది. వీటిలో అంతర పంటలు వేసుకొని అదనపు ఆదాయం పొందేందుకు అవకాశం ఉండటంతో కర్షకులు

రకం	మొక్కలు	మొదటి ఏడాది	రెండో	మూడో	మొత్తం
		రూ.లలో			
మామిడి	70	48,204	27,108	24,892	1,00,204
నిమ్మ	110	54,443	41,332	39,116	1,34,891
బత్తాయి	100	53,605	37,776	35,560	1,26,941
జామ	100	54,303	41,332	39,116	1,34,751
కొబ్బరి	60	43,198	23,802	21,336	88,336
సీతాఫలం	240	91,904	55,000	52,784	1,99,688
తైవాన్‌జామ	444	1,19,186	57,907	57,907	2,35,000
గులాబీ,మల్లి	2000	2,59,240	48,300	–	3,07,540
మునగ	448	55,492	30,180	–	85,672


ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పథకంలో భాగంగా వ్యవసాయ పొలాల్లో ఉద్యాన పంటలు సాగు చేసుకునేందుకు వీలు కల్పించటంతో పాటు వాటికి పెట్టుబడి వ్యయం కూడా మూడు సంవత్సరాల పాటు అందించేలా కార్యాచరణ రూపొందించారు.



ఆయిల్‌పామ్ తోటలో పిచికారీ చేస్తున్న రైతు

పశుగ్రాసానికి సైతం

అర్హత పొందిన రైతులకు మొక్కలు నాటే దశ నుంచి కలుపు తీయడం, ఎరువులు, మెటీరియల్ రూపంలో మూడు సంవత్సరాల వరకు నిధులు ఇస్తారు. తద్వారా పెట్టుబడి కష్టాలు ఉండవు. ఈ ఏడాది నుంచి పశుగ్రాసం పెంచుకునేందుకు కూడా ప్రోత్సాహం అందించేందుకు ప్రభుత్వం ముందుకొచ్చింది. ఈ పథకంలో భాగంగా ఎకరానికి రెండు సంవత్సరాలకు రూ.91వేలు అందుతుంది.



అవగాహన కల్పిస్తున్నాం

‘ఉద్యాన పంటల సాగుపై మెట్ట రైతులు ఆసక్తి చూపుతున్నారు. రాయితీలు, ప్రభుత్వ ప్రోత్సాహకాలపై అవగాహన కల్పిస్తున్నాం. మొక్కలు కొనుగోలు చేసిన తర్వాత బిల్లులు అందజేస్తే రైతులకు రాయితీ నగదు జమయ్యేలా చర్యలు తీసుకుంటాం’ అని చింతలపూడి ఉద్యానశాఖ అధికారిణి షాహీదా తెలిపారు.

మండలానికి ఎంపీ నిధులు రూ.26.50 లక్షలు

పోలవరం, న్యూస్‌టుడే: పోలవరం మండలానికి ఏలూరు ఎంపీ పుట్టామహేష్ కుమార్ రూ.26.50 లక్షలు కేటాయించినట్లు పీఆర్ ఏఈ సందీప్ తెలిపారు. ఈ నిధులతో పోలవరం, పట్టిసీమ, కొత్తపట్టిసీమ, గూటాల పంచాయతీల పరిధిలో ఏడు సీసీ రోడ్లు నిర్మిస్తామని పేర్కొన్నారు.



ఎంపీడీవోగా బాధ్యతల స్వీకరణ

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: ద్వారకాతిరుమల ఎంపీడీవోగా పి.వి. ప్రకాష్ కుమార్ బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన తిరుపతిరావు సొంత జిల్లా శ్రీకాకుళానికి బదిలీపై వెళ్లారు. ఏలూరు జడ్పీ కార్యాలయంలో ఏవోగా పనిచేస్తున్న ప్రకాష్ ద్వారకాతిరుమలకు వచ్చారు.

ఏపీఎంగా జేమ్స్.. పోలవరం, న్యూస్‌టుడే: పోలవరం మండల ఏపీఎంగా ఉజే జేమ్స్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు.

కుండపోత వర్షం

పోలవరం, న్యూస్‌టుడే: పోలవరంలో సోమవారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన కుండ పోత వర్షం కురిసింది. అక్కడక్కడ పిడుగులు పడ్డాయి. ఎండ తీవ్రతతో ఉక్కిరిబిక్కిరవుతున్న ప్రజలు వాతావరణం చల్లబడటంతో ఊరట చెందారు.

కొయ్యలగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: మండలంలో సోమవారం చెదురుమదురు వర్షం కురిసింది. పొగాకు నాయుడును నాట్లు వేస్తున్న రైతులు ఆందోళన చెందుతున్నారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద 11.4 మిమీ వర్షపాతం నమోదైనట్లు ఏఎస్ఓ వరప్రసాద్ తెలిపారు.

ఘనంగా తెప్పోత్సవం

పోలవరం, న్యూస్‌టుడే: పాతపోలవరం వాసులు గంగానమ్మ తెప్పోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన తెప్పపై అమ్మవారిని ఉంచి గరగ నృత్యాల మధ్య వీధుల్లో ఊరేగించారు. అనంతరం పసుపు, కుంకుమ, సారె, చీరతో పూజలు చేసి నదిలో నిమజ్జనం చేశారు. భవానీలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నకిలీ పత్రాలతో పొలం కాజేయాలని చూస్తున్నారు!

న్యాయం చేయాలంటూ తహసీల్దార్‌ను ఆశ్రయించిన బాధిత దంపతులు



తహసీల్దార్ వెంకటేశ్వరరావుకు వినతిపత్రం అందజేస్తున్న సుబ్బారావు దంపతులు

కొయ్యలగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: రెవెన్యూ దస్త్రాల్లో పేర్లు మార్చి పొలం కాజేయటానికి తమపై దాడి చేస్తున్నారని, న్యాయం చేసి రక్షణ కల్పించాలంటూ రాజవరానికి చెందిన సాధనాల సుబ్బారావు, సౌదామిని దంపతులు తహసీల్దార్ వెంకటేశ్వరరావును ఆశ్రయించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక(మీకోసం) కార్యక్రమంలో ఈ మేరకు సోమవారం ఆయనకు వినతిపత్రం అందజేశారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజవరం పరిధిలో 1984లో కొనుగోలు చేసిన సుమారు 2.80 ఎకరాల భూమిని కొందరు చనిపోయిన వ్యక్తి పేరుతో ఉన్న ఖాతా నంబరుతో నకిలీ పత్రాలు పుట్టించి పొలం తమదంటూ వివాదాలు సృష్టిస్తున్నారని సౌదామిని ఆవేదన వ్యక్తం చేశారు. గతేడాది గొడవకు దిగితే ఫిర్యాదు చేయగా.. తహసీల్దార్ కార్యాలయంలో విచారణ అనంతరం భూమి తమదిగా నిర్ధారించి అప్పటి తహసీల్దార్ ఉత్తర్వులు జారీ చేశారన్నారు. ఆర్ఓఆర్, ఆన్‌లైన్‌లోనూ తమ పేరు మీదే పొలం నమోదై ఉందన్నారు. అయినా పట్టికి జీవీల కొందరు పొలంలోకి అక్రమంగా చొరబడి కొబ్బరి మొక్కలు నాటే ప్రయత్నం చేశారని, అడ్డుకోబోయిన తమపై దాడికి పాల్పడ్డారని ఆందోళన వ్యక్తం చేశారు. తమకు ఎవరూ లేరన్న విషయాన్ని ఆసరాగా చేసుకుని దౌర్జన్యానికి పాల్పడుతున్న వ్యక్తుల నుంచి రక్షణ కల్పించాలని, భూమి తమకు దక్కేలా న్యాయం చేయాలని కోరుతూ ఫిర్యాదు చేశారు.

గిరిజనుల నుంచి 11 అర్జీలు



అధికారులకు విన్నవిస్తున్న గిరిజనులు

బుట్టాయగూడెం, న్యూస్‌టుడే: కేఆర్‌పురం ఐటీడీఏ వద్ద సోమవారం నిర్వహించిన గిరిజన సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో 11 అర్జీలు వచ్చాయని అధికారులు తెలిపారు. ఏపీవో పీవీఎస్ నాయుడు, ప్రత్యేక ఉప కలెక్టర్ శ్రీను కుమార్, తదితరులు గిరిజనుల నుంచి వినతులు స్వీకరించారు. ముంపు పరిధిలో కోల్పోయిన భూమికి పరిహారం ఇప్పించాలని కుక్కునూరు మండలం చీరవల్లికి చెందిన సరియం పుష్ప, కుక్కునూరుకు చెందిన జయశ్రీలక్ష్మి, స్వయం ఉపాధికి రుణ సదుపాయం కల్పించాలని కన్నాపురానికి చెందిన నవీన్‌కుమార్, కొండరెడ్డి తెగ గిరిజనులకు పట్టా భూములకు రీ సర్వే చేసి కొత్తగా పట్టాలు అందజేయాలని ఆలివేరు సర్పంచి కారం లక్ష్మి, గిరిజన సహకార సంస్థలో ఉద్యోగ అవకాశం కల్పించాలని పందుగూడెనికి చెందిన రాజేశ్‌లు కోరారు.

మద్యం దుకాణాలకు 154 దరఖాస్తులు



ప్రక్రియను పరిశీలిస్తున్న సీఐలు రవీంద్ర, అశోక్

చింతలపూడి, న్యూస్‌టుడే: సర్కిల్ పరిధిలో 16 మద్యం దుకాణాలకు సంబంధించి సోమవారం నాటికి 154 దరఖాస్తులు వచ్చినట్లు ఎక్సైజ్ సీఐ పండిరి అశోక్ తెలిపారు. ఈ నెల 9 వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు చెప్పారు. ఈ నేపథ్యంలో చింతలపూడి సర్కిల్ సీఐ రవీంద్రతో కలిసి దరఖాస్తుల ప్రక్రియను పరిశీలించారు.

వీధి దీపాల కోసం రూ.8 లక్షలు

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: పట్టణంలో వీధి దీపాలు వెలిగించేందుకు అవసరమైన సామగ్రి కొనుగోలుకు రూ.8లక్షలు కేటాయించినట్లు పురపాలక ఏఈ సంధ్య సోమవారం తెలిపారు. ఇందుకు సంబంధించిన టెండర్లు త్వరలోనే పిలవనున్నట్లు చెప్పారు.

వివాహిత అదృశ్యం

చింతలపూడి పట్టణం, న్యూస్‌టుడే: చింతలపూడి పట్టణం బట్టువారిగూడేనికి చెందిన వివాహిత అదృశ్యమైనట్లు ఎస్సై కుటుంబరావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. వివాహిత భర్త సిద్ధిపేటలో ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నారు. దీంతో ఆమె బట్టువారిగూడెంలో తల్లిదండ్రుల వద్దే ఉంటోంది. సోమవారం ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో తెలిసిన వారి వద్ద కుటుంబ సభ్యులు విచారించగా.. ఆచూకీ లభించలేదు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

వృద్ధ... టి.నరసాపురం, న్యూస్‌టుడే: గుర్వాయిగూడేనికి చెందిన గుర్రాల చంద్రబాబు ఈ నెల 5న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. అతడి ఆచూకీ కోసం కుటుంబ సభ్యులు పలు చోట్ల గాలించినా దొరకలేదు. తల్లి రామసీత ఇచ్చిన ఫిర్యాదు మేరకు సోమవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎం.జయబాబు తెలిపారు.

కొట్టి గాయపరిచిన వ్యక్తులపై కేసు..

జంగారెడ్డిగూడెం పట్టణం, న్యూస్‌టుడే: ఇంట్లోకి అక్రమంగా ప్రవేశించి కొట్టి గాయపర్చిన వ్యక్తులపై బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. స్టేషన్ రైటర్ శ్రీనివాసరెడ్డి కథనం మేరకు.. జంగారెడ్డిగూడెం మండలం వేగవరానికి చెందిన దంపతుల ఆడపడుచు కుమార్తె భర్త చనిపోయాడు. ఆమె ఆక్కడ ఉండే వ్యక్తితో వివాహేతర సంబంధం నెరుపుతుండటంతో కుటుంబ సభ్యులు పలుమార్లు మందలించారు. ఈ నెల 5న ఆక్కడ, మరో ముగ్గురు కలిసి ఇంటిలోకి అక్రమంగా ప్రవేశించి దంపతులు, ఆడపడుచును కొట్టి గాయపరిచారు. దీంతో పాటు దుర్భాషలాడి బెదిరించారు. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఇసుక ట్రాక్టర్ స్వాధీనం

జంగారెడ్డిగూడెం పట్టణం, న్యూస్‌టుడే: జంగారెడ్డిగూడెం మండలం మైసన్నగూడెం శివారు జల్లేరు వాగు నుంచి ట్రాక్టరులో ఇసుక అక్రమంగా తరలిస్తున్న వ్యక్తిని ఆదివారం రాత్రి అదుపులోకి తీసుకుని, ట్రాక్టర్ స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై జబీర్ తెలిపారు.

జూద శిబిరాలపై దాడి

చింతలపూడి పట్టణం, న్యూస్‌టుడే: చింతలపూడి మండలం చింతంపల్లిలో జూద స్థావరంపై దాడి చేసి ఆరుగురిని అరెస్టు చేసినట్లు ఎస్సై కుటుంబరావు సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా రూ. 86 వేలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

బుట్టాయగూడెం, న్యూస్‌టుడే: దొరమామిడి శివారులో ఆయిల్‌పామ్ తోటలో జూద స్థావరంపై దాడి చేసి ఆరుగురిని అరెస్టు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ జి.కృష్ణరాజు తెలిపారు. రూ. 6,200 స్వాధీనం చేసుకున్నామన్నారు.

కొయ్యలగూడెం, న్యూస్‌టుడే: బయ్యనగూడెంలో జూద శిబిరంపై దాడి చేసి ఆరుగురిని అదుపులోకి తీసుకుని, రూ. 3,620 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై వి.చంద్రశేఖర్ సోమవారం తెలిపారు.



మహాచండీ అలంకరణలో జంగారెడ్డిగూడెం గ్రామ దేవత గంగానమ్మ



ద్వారకాతిరుమల కుంకుళ్లమ్మ



బయ్యనగూడెంలో చక్రసహితకనకదుర్గమ్మ



లక్ష్మీదేవిగా జంగారెడ్డిగూడెం నూకాలమ్మ



కొయ్యలగూడెంలో లలితాపరమేశ్వరిగా దుర్గమ్మ

మహా చండీ.. మముబ్రోవు..!

దసరా ఉత్సవాల్లో అయిదో రోజైన సోమవారం అమ్మవారు మహాచండీగా దర్శనమిచ్చారు. పలు చోట్ల మహిళలు కుంకుమ పూజలు నిర్వహించారు. కొన్ని చోట్ల కాత్యాయని, మహాలక్ష్మి అలంకారంలో అమ్మవారు భక్తులను కటాక్షించారు. పోలవరం ఏటిగట్టు సెంటర్‌లోని దుర్గమ్మకు పసుపు కొమ్ములతో పూజలు నిర్వహించారు. - న్యూస్‌టుడే, బృందం



రాజవరంలో కుంకుమార్చన

అమరావతి నిర్మాణానికి విరాళం

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: రాజధాని అమరావతి నిర్మాణానికి ద్వారకాతిరుమల మండలం ఎం.నాగులపల్లికి చెందిన పలువురు మహిళలు రూ.71వేల విరాళం ఇచ్చారు. ఆ మొత్తాన్ని గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజుకు సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా మహిళలను ఎమ్మెల్యే అభినందించారు.

ఎల్టీఆర్ భూములు పంచాలని ధర్నా

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: బుట్టాయగూడెం మండలం మర్రిగూడెంలోని ఎల్టీఆర్ భూములను గిరిజనులకు పంపిణీ చేయాలని కోరుతూ సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ, ఏఐకేఎంఎస్ ఆధ్వర్యంలో సోమవారం ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం ఆర్డీవో అద్దయ్యకు వినతి పత్రం అందజేశారు. సాలి రాజశేఖర్, సముద్రాల సుందరరావు, కాశీబాబు, బత్తుల బాబూరావు, అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

23న ఐటీడీఏ వద్ద..

కొయ్యలగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: పోలవరం ప్రాజెక్టు ముంపు గ్రామాల పునరావాస కాలనీల్లో మౌలిక వసతుల కల్పన కోరుతూ ఈ నెల 23న కేఆర్‌పురం ఐటీడీఏ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు ఆదివాసీ భారత్ మహాసభ రాష్ట్ర కార్యదర్శి మడకం రామన్న సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

గాజాపై దాడులు నిలిపివేయాలని ప్రదర్శన

బుట్టాయగూడెం, న్యూస్‌టుడే: గాజా దేశంపై ఇజ్రాయెల్ చేస్తున్న దాడులను నిలుపుదల చేయాలని కోరుతూ సీపీఎం, సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ, సీపీఐ ఆధ్వర్యంలో బుట్టాయగూడెంలో సోమవారం ప్రదర్శన నిర్వహించారు. న్యూడెమోక్రసీ పార్టీ కార్యాలయం నుంచి నెహ్రూ బొమ్మ కూడలి వరకు నినాదాలు చేస్తూ ముందుకు సాగారు. నాయకులు సురేశ్, రామకృష్ణ, రాఘవ, ఫ్రాన్సిస్ తదితరులు నాయకత్వం వహించారు.

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: పాలస్తీనాపై ఇజ్రాయెల్ చేస్తున్న యుద్ధాన్ని తక్షణమే ఆపాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కమిటీ సభ్యుడు కేవీ రమణ డిమాండ్ చేశారు. స్థానిక దర్శన్స్ స్మారక భవనంలో పలు వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. రమణరాజు, సూర్యారావు, యు.ఏసుబాబు, ఎస్కే సుభానీ, ఎం.వి.హ్నేక్, కె.రామలక్ష్మి, జి.పండు తదితరులు పాల్గొన్నారు.

‘ఇసుక తెచ్చుకునేందుకు స్థానికంగా అనుమతి ఇవ్వాలి’

బుట్టాయగూడెం, న్యూస్‌టుడే: మన్యం గ్రామాల్లో కాలనీల గృహాల నిర్మాణానికి అవసరమైన ఇసుకను స్థానిక వాగుల నుంచి తెచ్చుకునేందుకు సర్పంచుల ద్వారా అధికారులు అనుమతి ఇవ్వాలని పలువురు సర్పంచులు కోరారు. బుట్టాయగూడెం ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో మండల పరిషత్తు సర్వసభ్య సమావేశం ఎంపీపీ కారం శాంతి అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. ఇసుక కొరతతో గృహాల నిర్మాణాలకు అవస్థలు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. లంకపాకల పాఠశాలలో పాత మరుగుదొడ్డి శిథిలావస్థలో ఉండటంతో విద్యార్థులు పలు అవస్థలు పడుతున్నారని, కొత్తవి మంజూరు చేయాలని అలివేరు సర్పంచి కారం లక్ష్మి కోరారు. ఎంపీటీసీ కుంజా జ్యోతి, తహసీల్దార్ బ్రహ్మం, ఎంఈవో చలపతిరావు, తెల్లం బాబూరావు, పలు శాఖాధికారులు పాల్గొన్నారు.



చర్చి ఫాదర్లతో రోషన్‌కుమార్

ఎమ్మెల్యేను సత్కరించిన చర్చి ఫాదర్లు

కామవరపుకోట (జంగారెడ్డిగూడెం), న్యూస్‌టుడే: కామవరపుకోటలోని కొత్తూరు ఆర్సీఎం ప్రధాన చర్చిలో జరుగుతున్న మేరీ మాత ఉత్సవాల్లో ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ సోమవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేక్ కోశారు. అనంతరం ఎమ్మెల్యేను చర్చి ఫాదర్లు సత్కరించారు. తెదేపా మండల అధ్యక్షుడు కిలారు సత్యనారాయణ, పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు. ★ విద్యుదాఘాతంతో రెండు కాళ్లు పనిచేయక మంచానికి పరిమితమైన తెదేపా కార్యకర్త కసె రాజేశ్‌ను ఎమ్మెల్యే రోషన్‌కుమార్ సోమవారం పరామర్శించారు. అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

వంతెన లేక.. గ్రామాలకు చేరుకోలేక..!

టి.నరసాపురం, న్యూస్‌టుడే: టి.నరసాపురం నుంచి చింతలపూడి మండలం కొమ్ముగూడెం వెళ్లే రహదారిలో ఎర్ర కాల్వ దాటడం ఆయా గ్రామాల ప్రజలకు నిత్యం గండంగా మారింది. భారీ వర్షాలు కురిసే సమయంలో కొండలపై నుంచి వచ్చే చిన్నచిన్న వాగులు ఎర్రకాల్వలో కలవడంతో అది ఉగ్రరూపం దాలుస్తోంది. దీంతో గ్రామాలకు చేరుకోవడం కష్టంగా ఉంటోంది. టి.నరసాపురం మండలానికి చెందిన రైతుల పొలాలు సుమారు రెండు వేల ఎకరాలకు పైగా కాలువ అవతలి వైపు ఉండటంతో సాగుకు ఏటా ఇబ్బందులు తప్పడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 25 ఏళ్లుగా కాలువపై వంతెన నిర్మించాలని ప్రజా ప్రతినిధులు, అధికారులను వేడుకుంటున్నా ఉపయోగం లేదని వారు ఆసహనం వ్యక్తం చేస్తున్నారు.



ద్వారకాతిరుమలను పారిశ్రామికంగా అభివృద్ధి చేస్తాం

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: ద్వారకాతిరుమల మండలానికి పరిశ్రమలు తీసుకొచ్చి పారిశ్రామికంగా అభివృద్ధి చేస్తాం.. తద్వారా నిరుద్యోగులకు ఉపాధి కల్పిస్తాం.. దీంతో రాబోయే రోజుల్లో మండల రూపురేఖలు మారిపోతాయని గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు అన్నారు. ద్వారకాతిరుమల మండల సర్వ సభ్య సమావేశం సోమవారం నిర్వహించారు. ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై వివిధ శాఖల పురోగతిపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్వారకాతిరుమల మండలం అభివృద్ధి పరంగా వెనుకబడి ఉందన్నారు. అధికారులు సమన్వయ లోపం స్పష్టంగా కనిపిస్తోందన్నారు. క్లిష్ట పరిస్థితిలో గోపాలపురం నియోజకవర్గానికి రూ.21 కోట్ల నిధులు రాబట్టానని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో మండలాన్ని ఆధ్యాత్మికంగా, టెంపుల్ టూరిజం పరంగా అభివృద్ధి చేయడానికి ప్రణాళికతో ముందుకెళ్తామన్నారు. ఎంపీపీ బొండాడ మోహిని, జడ్పీటీసీ సభ్యుడు శామ్యూల్, ఇమ్మడి రత్నాజీ, మల్లిపెద్ది వెంకటేశ్వరరావు, మొగతడకల శ్రీనివాసరావు, పోలిన శ్రీను తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వెంకటరాజు

మహిళా సాధికారతే ప్రభుత్వ లక్ష్యం

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: మహిళా సాధికారతే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు అన్నారు. ద్వారకాతిరుమల మండలం ఎం.నాగులపల్లి లక్ష్మీ పురంలో ఆధ్వర్యంలో మహిళలకు మెగా ఉద్యోగ మేళా సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాపార సంస్థలు గ్రామీణ మహిళలకు ఉపాధి కల్పించేలా ఉద్యోగాలు ఇవ్వాలన్నారు. తద్వారా వారి కుటుంబాలు ఆర్థికంగా బలపడతాయని చెప్పారు. అనంతరం గ్రామంలో పలు అభివృద్ధి పనులకు భూమి పూజ చేశారు.

ఉద్యోగ నియామక చట్టం కోసం కృషి

బుట్టాయగూడెం, న్యూస్‌టుడే: జీవో నంబరు-3కి ప్రత్యామ్నాయంగా మన్యం ప్రాంత ఉద్యోగ నియామక చట్టం రూపొందించేందుకు కృషి చేయనున్నట్లు ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జలగం రాంబాబు తెలిపారు. సంఘ జిల్లా విస్తృత స్థాయి సమావేశం బుట్టాయగూడెంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో నైట్ స్టడీ అవర్స్ నిర్వహణకు డీడీ ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేయాలని కోరారు. ఇతర ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో మాదిరిగా గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో మంజూరైన (గ్రేడ్-2 తెలుగు, హిందీ పండిట్, పీఈటీ ఉద్యోగాలను వర్తింపజేయాలన్నారు. అనంతరం సంఘం జిల్లా కమిటీ ఎన్నిక నిర్వహించారు. గౌరవ అధ్యక్షుడిగా సోడెం రాజు, అధ్యక్షుడిగా సరియం నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా కుంజా రమేశ్, కోశాధికారిగా సరియం వెంకటేశ్వరరావు, కార్యదర్శులుగా పలువురితో పాటు 11 మంది రాష్ట్ర కౌన్సిలర్లను ఎన్నుకున్నారు.



కొత్త కమిటీ ప్రతినిధులతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న రాంబాబు

నూజివీడు

•నూజివీడు •కైకలూరు

దరఖాస్తుల స్వీకరణకు మూడు కేంద్రాలు



నూజివీడు, న్యూస్‌టుడే: నూజివీడు ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ స్టేషన్ పరిధిలో 16 మద్యం దుకాణాలకు 3 కౌంటర్లు ఏర్పాటు చేసి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఎక్సైజ్ సీఐ ఎ.మస్తానయ్య తెలిపారు. ఆయన సోమవారం మాట్లాడుతూ.. ఆగిరిపల్లి మండలంలో నాలుగు, ముసునూరు మండలంలో మూడు, చాట్రాయి మండలంలో రెండు, నూజివీడు పట్టణ పరిధిలో మూడు, నూజివీడు గ్రామీణ మండల పరిధిలో నాలుగు మొత్తం 16 దుకాణాలకు ఇప్పటి వరకు 48 దరఖాస్తులు అందినట్లు సీఐ తెలిపారు.

సకాలంలో సమస్యలు పరిష్కరించండి: ఆర్డీవో



అర్జీదారులతో మాట్లాడుతున్న వాణి

నూజివీడు పట్టణం, న్యూస్‌టుడే: మీ-కోసంలో ప్రజల నుంచి వచ్చే సమస్యల అర్జీలను సకాలంలో పరిష్కరించాలని అధికారులను ఆర్డీవో ఎం.వాణి ఆదేశించారు. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం మీ-కోసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ.. మీ-కోసంలో 15 అర్జీలు వచ్చినట్లు తెలిపారు. ప్రతి అర్జీ ఆన్‌లైన్ చేస్తున్నామన్నారు. త్వరితగతిన ఆయా సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

నూజివీడు : 99486 40551 | కైకలూరు: 73060 88555
ముసునూరు : 93983 81268 | కలిదిండి: 90594 84862

నూజివీడు పట్టణం, న్యూస్‌టుడే

సమస్య: నూజివీడు పట్టణం హనుమాన్ జంక్షన్ రహదారిలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఉపయోగించిన చెత్తను సమీపంలో పోస్తున్నారు. దుర్వాసన వస్తోంది. **- నాగేశ్వరరావు, నూజివీడు**

సమాధానం: చెత్త ఆ ప్రాంతంలో వేయకుండా చర్యలు తీసుకుంటాం. **- ఆర్.వెంకట రామిరెడ్డి, మున్సిపల్ కమిషనర్**

ముసునూరు, న్యూస్‌టుడే

సమస్య: ముసునూరు- నూజివీడు, చింతలపల్లి- చెక్కపల్లి ప్రధాన రహదారులపై ఇరువైపులా కంప చెట్లు, పిచ్చి మొక్కలు పెరిగి రోడ్డుపైకి వస్తున్నాయి. దీంతో ఆయా ప్రయాణించే వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకొని ప్రమాదాలు అరికట్టాలి. **- పంగిడయ్య, ముసునూరు**

సమాధానం: ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరైన వెంటనే తొలగిస్తాం. **- అశోక్‌బాబు, ఆర్అండ్‌బీ ఏఈ**

కైకలూరు, న్యూస్‌టుడే

సమస్య: కైకలూరు 2వ వార్డులో నివాసాల చెంత కొందరు చెత్త, వ్యర్థాలు వేస్తున్నారు. పారిశుద్ధ్య కార్మికులు రోజుల తరబడి చెత్త సేకరణ చేయకపోవడంతో ఆ ప్రాంతం దుర్వాసన వస్తోంది. ఇబ్బందులు పడుతున్నాం. **- రామలక్ష్మి, కైకలూరు**

సమాధానం: వెంటనే చెత్త, వ్యర్థాలు సేకరించి అక్కడ వేయకుండా స్థానికులకు అవగాహన కల్పిస్తాం. **- వెంకటేశ్వరరావు, పంచాయతీ ఈవో**

కలిదిండి, న్యూస్‌టుడే

సమస్య: గ్రామంలోని ప్రధాన మార్గంలో రహదారి పక్కన వీధి దీపాలు సక్రమంగా వెలగడం లేదు. రాత్రి వేళల్లో ఇబ్బందిగా ఉంటుంది. **- శ్రీను, సానారుద్రవరం**

సమాధానం: పని చేయని దీపాలను తొలగించి కొత్తవి ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకుంటాం. **- రాఘవేంద్రరావు, పంచాయతీ కార్యదర్శి**

చెత్త, వ్యర్థాల తొలగింపు

ముసునూరు, న్యూస్‌టుడే: చెక్కపల్లి- లోపూడి రహదారిలో ఇరువైపులా చెత్త, వ్యర్థాలు పేరుకుపోవడంపై సోమవారం 'ఈనాడు'లో 'మేమున్నాం.. మీకు తోడుగా' శీర్షిక ప్రచురితమైంది. దీనిపై పంచాయతీ కార్యదర్శి సుజాత స్పందించి పారిశుద్ధ్య కార్మికులతో చెత్త, వ్యర్థాలు తొలగింపజేశారు.

ఆక్వాకు జోన్ కష్టాలు

సాగుదారులకు అందని కరెంటు రాయితీ



కలిదిండి, న్యూస్‌టుడే

ఆక్వా రంగానికి 'జోన్' కష్టాలు వెంటాడుతున్నాయి. 2014 నుంచి 2019 వరకు తెదేపా హయాంలో ఆక్వా రైతులకు ఊతం లభించింది. విద్యుత్తు, ఏరియేటర్లు, మందులు ఇలా ఎన్నో రకాలుగా రాయితీలు సాగుదారులకు వెన్నుదన్నుగా నిలిచాయి. కలిదిండి మండలం ఏపీకి ఆదాయాన్ని సమకూర్చడంలో తొలి స్థానంలో నిలిచింది. ఆ క్రమంలో వైకాపా ప్రభుత్వం ఆక్వా జోన్లు తీసుకురావడంతో పరిస్థితులు తల్లకిందులయ్యాయి. అర్హత కలిగిన ప్రాంతాలనూ నాన్ ఆక్వా జోన్‌గా పరిగణించడంతో అక్కడి చెరువులకు రాయితీలు వర్తించడం లేదు. విద్యుత్తు సరఫరా ఏర్పాటుకూ నానా పాట్లు పడాల్సి వస్తోంది. రైతులంతా ప్రస్తుత కూటమి ప్రభుత్వంపైనే ఆశలు పెట్టుకున్నారు. నియోజకవర్గంలో 80 శాతం సాగు ఆక్వా కిందే ఉన్న ఈ నేపథ్యంలో కైకలూరు నియోజకవర్గాన్ని ఆక్వా జోన్ పరిధిలోకి తీసుకు రావాలని రైతులు ఆకాంక్షిస్తున్నారు.

నియోజకవర్గంలో ఇలా..

ఆక్వా సాగు మొత్తం	: 48 వేల ఎకరాలు
రైతులు	: 30 వేల మంది
విద్యుత్తు సర్వీసులు	: 7,496
రాయితీ వర్తిస్తున్నవి	: 5,869
రాయితీ రానివి	: 1,627

(నాన్ ఆక్వా జోన్ పేరుతో విద్యుత్తు సర్వీసులు ఇవ్వని చెరువులు 10 వేల ఎకరాలకుపైగా ఉన్నాయి)

ఈ వ్యత్యాసం ఏమిటో

ఏడాది కిందట రెండు ఎకరాలు రొయ్యల చెరువు తవ్వుకున్నా. నాన్ ఆక్వా జోన్‌లో ఉన్నందున విద్యుత్తు సరఫరా ఇవ్వడం లేదు. మాకు కూతవేటు దూరంలో ఉన్న చెరువులు ఆక్వా జోన్‌లోనే ఉన్నాయి. ఈ వ్యత్యాసం ఏంటో అర్థం కావడం లేదు. చెరువు తవ్వి.. ఖాళీగా పెట్టుకోవాల్సి వస్తోంది. పోనీ తవ్వడం మానేద్దామా అంటే చుట్టూ చెరువులే ఉన్నాయి. పంట పండక తప్పనిసరి పరిస్థితుల్లో తవ్వుకోవాల్సి వచ్చిందని కలిదిండి మండలం గోపాలపురం గ్రామానికి చెందిన ఆక్వా రైతు కోలా రాజా ఆవేదన చెందుతున్నారు.

ప్రభుత్వ పరిశీలనలో ఉంది

ఆక్వాకు సంబంధించిన 2వ నోటిఫికేషన్‌లో కొన్ని సర్వీసులను ఆక్వా జోన్ పరిధిలోకి తెచ్చారు. 3వ నోటిఫికేషన్ వెలువడాల్సి ఉంది. దీనిలో అర్హత కలిగిన మరికొన్ని సర్వీసులు చేర్చుతారా? అన్నింటికీ వర్తింపజేస్తారా? అన్నది స్పష్టత లేదు. 2022 డిసెంబరు నాటికి తీసుకున్న విద్యుత్తు సర్వీసులను మాత్రమే పరిగణనలోకి తీసుకుంటారు. ఆ తరవాత ఇచ్చిన సర్వీసులపై తుది నిర్ణయం ప్రభుత్వానిదేనని వివరించారు కైకలూరు మత్స్యశాఖ ఏడీ రాజ్‌కుమార్.

వన్య ప్రాణులను సంరక్షించుకోవాలి



అటవీ శాఖ అధికారులు, సిబ్బంది అవగాహన ప్రదర్శన

మండవల్లి, న్యూస్‌టుడే: ప్రతి ఒక్కరూ వన్య ప్రాణులను సంరక్షించుకోవాల్సిన అవసరం ఉందని మండవల్లి జడ్పీటీసీ సభ్యురాలు ముంగర విజయనిర్మల అన్నారు. వన్యప్రాణి వారోత్సవాలను పురస్కరించుకుని కైకలూరు రేంజ్ అటవీ శాఖ ఆధ్వర్యంలో సోమవారం మండలంలోని ఇంగిలిపాకలంకలో గ్రామస్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న విజయనిర్మల మాట్లాడుతూ.. పర్యావరణాన్ని పరిరక్షించడంలో వన్య ప్రాణులు ముఖ్య భూమిక పోషిస్తాయన్నారు. అనంతరం అటవీ శాఖ అధికారులతో కలిసి గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. తెదేపా నేత ఎం.మల్లికార్జునరావు, డీఆర్వో రమేష్, సిబ్బంది రాజేష్, వెంకన్న, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహాల ప్రతిష్ఠ

ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: ఆగిరిపల్లి వరాహ పుష్కరిణి సమీపంలోని బాలా త్రిపుర సుందరీదేవి సమేత ముక్తేశ్వర స్వామి ఆలయంలో విశ్రాంత ఉపాధ్యాయుడు జూలూరు చంద్రమౌళీశ్వరరావు, ఆయన కుమారుడు కోటేశ్వరరావు కాలభైరవ, చండీశ్వర విగ్రహాలను, హైదరాబాద్‌కు చెందిన కోదండ రమేశ్, శారద దేవి దంపతులు పంచలోహ సరస్వతీ దేవి విగ్రహాన్ని సోమవారం ప్రతిష్ఠించారు. హోమాలు, కుంకుమ, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కూటమి పాలనలో రాష్ట్రాభివృద్ధి



మాట్లాడుతున్న ఫణిబాబు

చాట్రాయి, న్యూస్‌టుడే: కూటమి పాలనలో రాష్ట్రాభివృద్ధిలో పురోగతి ఉందని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేసే లక్ష్యంతో పని చేస్తున్నట్లు జనసేన నియోజకవర్గ సమన్వయకర్త బర్మా ఫణిబాబు అన్నారు. బూరుగుగూడెంలో నిర్మించిన జనసేన దిమ్మను ఆయన సోమవారం ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ తనదైన శైలిలో పాలనలో నూతన విధానాలను అమలు చేస్తూ ప్రజల మన్ననలు పొందుతున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు తుమ్మల జగన్, వెల్లంకి శ్రీమన్నారాయణ, గోవర్ధన్‌రెడ్డి, గడ్డం కేశవరెడ్డి, తేళ్లూరి శేఖర్, ఆదిమూలం శర్మ, మేకపోతుల వెంకటేశ్వరరావు, మేక ఈశ్వరి, సీహెచ్.రమేష్, మధుబాబు, యాసీన్ తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ అధికారుల బదిలీ

ముదినేపల్లి, న్యూస్‌టుడే: మండలంలో పనిచేస్తున్న పలువురు రెవెన్యూ అధికారులు బదిలీ అయ్యారు. నూతనంగా వచ్చిన వారు సోమవారం బాధ్యతలు చేపట్టారు. ముదినేపల్లి ఆర్ఐ శివకుమార్ బదిలీపై గుడ్లవల్లేరు రెవెన్యూ కార్యాలయానికి సీనియర్ అసిస్టెంట్‌గా వెళ్లారు. ఆయన స్థానంలో కలిదిండి నుంచి ఎస్.శ్యామ్యూల్ బదిలీపై వచ్చారు. అల్లూరు వీఆర్వో పద్మావతి వడాలికి, ఇక్కడ పనిచేస్తున్న కె.మురళీ పెనమల్లికి, అక్కడ నుంచి వీరవెంకట హనుమంతరావు ముదినేపల్లి-1, ఇక్కడ నుంచి కరీమ్ కోడూరుకు బదిలీయ్యారు. పెదపాలపర్రు నుంచి ఆర్.సుబ్రహ్మణ్యం ముదినేపల్లి-2కు, సింగరాయపాలెం నుంచి వెంకట్రావు పెదగొన్నూరుకు, అక్కడ నుంచి ఏడుకొండలు శ్రీహరిపురం, ఇక్కడ నుంచి రామసుబ్బయ్య సింగరాయపాలెంకు బదిలీ అయ్యారు. అలాగే వైవాక నుంచి ఫణి వాడవల్లికి, చిగురుకోట నుంచి కిశోర్ కొర్రగుంటపాలెంకు, వాడవల్లి నుంచి ఏసుబాబు చిగురుకోటకు బదిలీ అయ్యారు. వణుదుర్రు వీఆర్వో నరసింహారావు విన్నకోటకు, పెయ్యేరు వీఆర్వో కేశవ నూజివీడుకు, గురజ వీఆర్వో పవన్ సీతారామపురానికి బదిలీపై వెళ్లారు.

విద్యార్థులకు శుద్ధి నీరే ఇవ్వండి

చాట్రాయి, న్యూస్‌టుడే: విద్యార్థులు పాఠశాలల్లో ఎదుర్కొనే తాగునీటి సమస్యను నిర్లక్ష్యం చేయొద్దని, శుద్ధి చేసిన నీరు విధిగా వారికి అందించాలని ఎంపీడీవో రాణి ఎంఈవో బ్రహ్మచారికి సూచించారు. ఎంపీపీ లంక నిర్మల అధ్యక్షతన సోమవారం మండల పరిషత్తు సమావేశం నిర్వహించగా జడ్పీటీసీ సభ్యురాలు చెలికాని అనూష పాల్గొన్నారు. బూరుగుగూడెం, సి.గుడిపాడు పాఠశాలల్లో తాగునీటి యంత్రాలు పనిచేయడం లేదని ఎంపీపీ నిర్మల, ఉపాధ్యక్షుడు సుబ్బారెడ్డి ప్రశ్నించగా ఎంఈవో మాట్లాడుతూ.. కంపెనీలు యంత్రాలను పట్టించుకోవడం లేదని తెలపాగా.. ఎంపీడీవోపై రీతిలో స్పందించారు. వెంటనే పని చేయని యంత్రాలకు ఎంత నిధులు కావాలో పరిశీలించి తనకు నివేదిక ఇవ్వాలని పంచాయతీ రాజ్ ఏఈ కృష్ణను ఆమె ఆదేశించారు. సమావేశంలో సీడీపీవో నూరాని, ఏఈ రఘు, ఇవో ఆర్డీ విజయలక్ష్మి, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు. సమావేశానికి వివిధ శాఖల అధికారులు రాకపోవడంతో ఇకపై ఇలా చేస్తే నేరుగా కలెక్టర్‌కు జాబితా పంపుతామని ఎంపీడీవో రాణి తెలిపారు.



ఎంఈవోను ప్రశ్నిస్తున్న ఎంపీడీవో రాణి

ఆత్మస్థైర్యంతో వైకల్యాన్ని అధిగమించాలి



కృత్రిమ కాళ్లు అమర్చిన వారితో మస్తానయ్య, హీల్ ప్రతినిధులు

ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: అందుబాటులో ఉన్న అవకాశాలు వినియోగించుకుని ఆత్మస్థైర్యమే ఆయుధంగా మలుచుకుని వైకల్యాన్ని అధిగమించాలని ఏపీ సమగ్ర శిక్షా స్టేట్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషనల్ మేనేజ్‌మెంట్ అండ్ ట్రైనింగ్ డైరెక్టర్ డా.వి.ఎన్.మస్తానయ్య అన్నారు. ఆగిరిపల్లి మండలం తోటపల్లిలోని హీల్ కృత్రిమ అవయవ కేంద్రంలో అమెరికాకు చెందిన ఇమ్మడి రామకృష్ణ జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యుల ఆర్థిక సాయంతో ముగ్గురికి ఆరు కృత్రిమ కాళ్లను మస్తానయ్య చేతుల మీదుగా సోమవారం అందజేశారు. కార్యక్రమంలో సమగ్ర శిక్షా అధ్యాపకులు డా.శారద, డా.ప్రసాద్, డా.ఎస్.లక్ష్మణ్, హీల్ కార్యదర్శి టి.లక్ష్మి, సీఈవో అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి అవసరాలకు చేయూతనివ్వండి



రామారావుకు వినతి పత్రం ఇస్తున్న నాయకులు

కైకలూరు, న్యూస్‌టుడే: కొల్లేరు లంక గ్రామాల్లో తాగునీటి వసతి కల్పించేందుకు ఓఎన్‌జీసీ సంస్థ అధికారులు చేయూతనివ్వాలని తెదేపా వడ్డి సాధికారక రాష్ట్ర కన్వీనర్ బలే ఏసురాజు కోరారు. వెనుకబడిన ప్రాంతాల్లో రక్షిత మంచినీటి ట్యాంకుల నిర్మాణాలకు ఓఎన్‌జీసీ సహకారం అందిస్తున్న నేపథ్యంలో ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ సూచనల మేరకు రాజమహేంద్రవరం ఓఎన్‌జీసీ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ రామారావును కొల్లేరు నాయకులతో సోమవారం కలిశారు. కైకలూరు, మండవల్లి మండలాల్లోని పెంచికలమర్రు, పందిరిపల్లిగూడెం, ఇంగిలిపాకలంకలో రక్షిత మంచినీటి ట్యాంకులు నిర్మించాలని కోరినట్లు ఏసురాజు తెలిపారు. నాయకులు జయమంగళ సుబ్బరాజు, జీ.గంగరాజు, సైదు గాంధీ పాల్గొన్నారు.

పట్టికలో ధరొకటి.. అమ్మేది మరొకటి!

నూజివీడు రైతు బజార్‌లో ఇదీ పరిస్థితి



నూజివీడు పట్టణం, న్యూస్‌టుడే: నూజివీడు పట్టణంలోని ప్రభుత్వ రైతు బజార్‌లో పట్టికలో సూచించిన కూరగాయల ధరల కంటే కిలో రూ.5 అధికంగా అమ్ముతున్నారంటూ వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కిలో టమాట రూ.76 పట్టికలో ఉండగా.. రూ.85కు విక్రయిస్తున్నట్లు తెలిసింది. దోసకాయ రూ.35 ఉంటే రూ.40కి వంకాయ రూ.36కి రూ.40, పచ్చిమిర్చి రూ.22 ఉండగా రూ.27కి ఇలా అన్ని రకాల కూరగాయల ధరల్లోనూ అధికంగా వసూలు చేస్తున్నట్లు వినియోగదారులు వాపోతున్నారు. ఈ విషయమై ఇన్‌ఛార్జి ఎస్టేట్ అధికారిని భవానిని సంప్రదించగా.. తాను సెలవులో ఉన్నానని, అధిక ధరల విషయం తన దృష్టికి రాలేదని తెలిపారు.

టమాట రూ.85కి..

'రైతు బజార్లో అన్ని కూరగాయల ధరలు పట్టిక కంటే ఎక్కువగా అమ్ముతున్నారు. టమాట రూ.76 పట్టికలో ఉండగా.. రూ.85 అమ్ముతున్నారు.' అని నూజివీడుకు చెందిన సత్యశ్రీధర్ వాపోయారు.

కిలోకి రూ.5 ఎక్కువకు..

'గ్రామాల్లో కూరగాయల ధరలు ఎక్కువగా అమ్ముతున్నారని పట్టణంలోని రైతు బజార్‌కు వచ్చా. కానీ ఇక్కడ కూడా ధరల పట్టిక కంటే కిలో అయిదు రూపాయలు ఎక్కువగా తీసుకుంటున్నారు.' అని నూజివీడు మండలం తుక్కులూరు గ్రామానికి చెందిన టి.నిర్మల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అవతార రూపిణి.. అభయ ప్రదాయిని

న్యూస్‌టుడే, బృందం: ఆగిరిపల్లి వరాహ పుష్కరిణి సమీపంలోని కనకదుర్గమ్మ లలితాదేవి అలంకరణలో దర్శనమిచ్చారు. యాదవుల మండపం దగ్గర అమ్మవారిని మహాలక్ష్మీదేవిగా అలంకరించారు. లోకుమూడి దత్తాశ్రమంలో దుర్గామాతను కాశీఅన్నపూర్ణాదేవిగా అలంకరించారు. ఇంగిలిపాకలంకలోని శివగుళ్లంకమ్మ అమ్మవారు అన్నపూర్ణాదేవిగా దర్శనమిచ్చారు. కైకలూరు శ్యామలాంబ, వాసవీ కన్యాక పరమేశ్వరీ అమ్మవార్లు కాశీ అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. కొల్లేటికోటలోని పెద్దింట్లమ్మ అమ్మవారికి విశేష అభిషేకాలు జరిపించారు. కొర్లగుంట, ముసునూరు, పెద్దపాటివారిగూడెం, గోపవరం గ్రామాల్లో అమ్మవారు, బలివేలో రాజరాజేశ్వరీదేవి భక్తులకు మహాచండీదేవిగా దర్శనమిచ్చారు. కోరుకొల్లులోని సోమేశ్వరస్వామివారి దేవస్థానంలో పార్వతీమాతను మంగళగౌరీదేవి రూపంలో అలంకరించారు. సంతోషపురంలోని కనకదుర్గమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. నూజివీడు పట్టణంలోని కోట మహిషాసురమర్దని అమ్మవారిని మహాచండీదేవిగా అలంకరించారు. దేవపూడిలోని విజయదుర్గాదేవి సమేత హిమగిరి రామలింగేశ్వరస్వామి ఆలయంలో ధనలక్ష్మీదేవిగా, అల్లూరు రేణుకా అమ్మవారు మహాచండీగా, గురజలో పార్వతీదేవి కాశీ అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.



నూజివీడు: మహాచండీదేవి



కొర్లగుంటలో..



లోకుమూడి దత్తాశ్రమంలో..



దేవపూడి: ధనలక్ష్మి



కోరుకొల్లు: మంగళగౌరీదేవి

వింజరంలో లక్ష దీపోత్సవం



కైకలూరు, న్యూస్‌టుడే: కైకలూరు మండలంలోని వింజరం శ్రీకోదండ రామాలయంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అమ్మవారికి లక్ష దీపోత్సవం వైభవంగా నిర్వహించారు. దీపాలతో అలంకరణ చేసిన అమ్మవారి వర్ణ చిత్రం చూపరులను విశేషంగా ఆకట్టుకుంది.

అనారోగ్యంతో బాధపడుతూ ఆత్మహత్య

నూజివీడు, న్యూస్‌టుడే: అనారోగ్యం తట్టుకోలేక ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన నూజివీడు మండలం తుక్కులూరులో సోమవారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన తమ్మిశెట్టి రాంబాబు(51) భార్య నాలుగేళ్ల కిందట చనిపోయారు. అప్పటి నుంచి ఆయన అనారోగ్యం బారినపడ్డారు. ఈ మధ్య సమస్య తీవ్రం కాగా.. సోమవారం ఆ బాధ తట్టుకోలేక ఎలుకల మందు తిన్నారు. అపస్మారక స్థితిలో ఉన్న రాంబాబును బంధువులు గమనించి నూజివీడు ఏరియా ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరిశీలించి రాంబాబు అప్పటికే మృతి చెందారని పేర్కొన్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు నూజివీడు గ్రామీణ ఎస్సై పి.లక్ష్మణబాబు తెలిపారు.

విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తిపై కేసు

ముసునూరు, న్యూస్‌టుడే: ముసునూరు మండలం రమణక్కపేటలో ప్రభుత్వ భూమిని ఆక్రమించుకొని నిర్మాణాలు చేపడుతున్న కట్టడాలను అడ్డుకునేందుకు వెళ్లిన తనను దూర్భాషలాడి, అసభ్య పదజాలంతో దూషిస్తూ, విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ పంచాయతీ కార్యదర్శి ప్రసాద్ సోమవారం ముసునూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కార్యదర్శి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలో ఉప్పే పిచ్చియ్య 0.06 సెంట్ల భూమిని కొంతకాలం కిందట అప్పటి వీఆర్వో సంతకాలను ఫోర్జరీ చేసి పొజిషన్ సర్టిఫికెట్ పొంది రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. దీనిపై అప్పటి వీఆర్వో పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదైంది. అప్పట్లో పలుమార్లు పిచ్చియ్యకు నోటీసులు సైతం జారీ చేశారు. ఆ తర్వాత పిచ్చియ్య భూమి తనదని హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. కేసు కోర్టులో ఉండగానే సోమవారం మళ్లీ పనులు చేపట్టారు. దీనిపై సమాచారం తెలుసుకున్న కార్యదర్శి అక్రమ నిర్మాణాన్ని అడ్డుకునేందుకు వెళ్లారు. దీంతో తనపై అసభ్య పదజాలంతో దూషించి, విధులకు ఆటంకం కలిగించారని పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి అక్రమ నిర్మాణాలను అడ్డుకున్నారు.

బాధ్యతల స్వీకరణ



రాఘవరావు

నూజివీడు, న్యూస్‌టుడే: నూజివీడు సబ్ రిజిస్ట్రార్‌గా రాఘవరావు సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఇక్కడ విధులు నిర్వహించిన తులసి రత్నం ఉద్యోగ విరమణ చేశారు. రాఘవరావు ఏలూరు నుంచి సాధారణ బదిలీల్లో భాగంగా నూజివీడు వచ్చారు.



ఉదయభాస్కరరావు

నూజివీడు, న్యూస్‌టుడే: నూజివీడు సబ్ కలెక్టర్ కార్యాలయ పరిపాలనాధికారిగా మాచిరాజు ఉదయ భాస్కరరావు సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన కైకలూరు తహసీల్దారుగా బాధ్యతలు నిర్వహించారు. సాధారణ బదిలీల్లో భాగంగా నూజివీడు వచ్చారు. ఈ సందర్భంగా సోమవారం నూజివీడు ఆర్డీవో ఎం.వాణిని మర్యాద పూర్వకంగా కలిసి మొక్క అందజేశారు.



భార్గవి

ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: ఆగిరిపల్లి ఎంపీడీవోగా బి.భార్గవి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆమె విజయవాడ గ్రామీణ ఎంపీడీవో కార్యాలయం నుంచి బదిలీపై ఆగిరిపల్లి వచ్చారు. ఇక్కడ ఎంపీడీవోగా పనిచేసిన పి.శంకరరావు ఆగస్టు 31న ఉద్యోగ విరమణ చేయడంతో ఎంపీడీవో కార్యాలయ ఏవో అబ్దుల్ సలామ్ ఇన్‌ఛార్జి ఎంపీడీవోగా బాధ్యతలు నిర్వహించారు. ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది, పంచాయతీ రాజ్ ఉద్యోగులు ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు.



చిరంజీవి

ముసునూరు, న్యూస్‌టుడే: ముసునూరు ఎస్సైగా ఎం.చిరంజీవి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన కృష్ణాజిల్లా నుంచి బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. శాంతి భద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని సూచించారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎస్సైకు సిబ్బంది పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.

అవగాహనతోనే పంచాయతీల అభివృద్ధి



మాట్లాడుతున్న ఎంపీపీ కృష్ణ

కైకలూరు, న్యూస్‌టుడే: గ్రామాలను అభివృద్ధి బాటలో నడిపించేందుకు సర్పంచి, పాలకవర్గ సభ్యులు సమన్వయంతో పనిచేయాలని ఎంపీపీ అడవి కృష్ణ అన్నారు. ఇన్‌ఛార్జి ఎంపీడీవో వై.సూర్యప్రకాష్ చౌదరి ఆధ్వర్యంలో సోమవారం స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో వార్డు సభ్యులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈవోపీఆర్డీ కొండలరావు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ముసునూరు, న్యూస్‌టుడే: ప్రజల ఆశయాలకు అనుగుణంగా ప్రజాప్రతినిధులు బాధ్యతలను సక్రమంగా నెరవేర్చినప్పుడే ప్రజల మన్ననలను పొందగలరని ఎంపీపీ కొండ దుర్గాభవానీ, ఎంపీడీవో జి.రాణి, ఈవోపీఆర్డీ బీపీ సత్యనారాయణ అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఉప సర్పంచి, వార్డు సభ్యులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.

ముదినేపల్లి, న్యూస్‌టుడే: పంచాయతీలకు వచ్చే నిధులు, విధులు, బాధ్యతలపై ఉప సర్పంచులు, వార్డు సభ్యులు అవగాహన కలిగి ఉంటేనే వాటిని అభివృద్ధి పథంలో నడపవచ్చని ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ అన్నారు. స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో ఉప సర్పంచులు, వార్డు సభ్యులకు శిక్షణ కార్యక్రమం ప్రారంభించారు. ఎంపీడీవో రామకృష్ణ, ఈవోపీఆర్డీ ఆశోక్ తదితరులు పాల్గొన్నారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్టు

చాగల్లు, కొవ్వూరు పట్టణం, న్యూస్‌టుడే: కొవ్వూరు మండలం దొమ్మేరు సొసైటీలో ఈ నెల 6న నగదు, కంప్యూటర్ మోడెమ్‌తో పాటు ఇతర సామగ్రి చోరీకి గురయ్యాయి. దర్యాప్తులో ముదినేపల్లి మండలం పెదగొన్నూరుకు చెందిన గుబ్బిలి సుబ్రహ్మణ్యం చోరీకి పాల్పడినట్లు గుర్తించి సోమవారం అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుంచి రూ.5 వేల నగదు స్వాధీనం చేసుకొని కోర్టులో హాజరు పరిచారు.

అవి ఇవి అన్నీ

'వర్గీకరణపై మరో న్యాయ పోరాటం'.. చాట్రాయి, న్యూస్‌టుడే: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా వేసిన పిటిషన్‌ను అత్యున్నత న్యాయస్థానం కొట్టివేసినా.. తమ న్యాయ పోరాటం మాత్రం కొనసాగుతుందని మాల యోధుల సంఘ కోర్ కమిటీ సభ్యులు నక్కా రాము అన్నారు. సూరంపాలెంలో సోమవారం అంబేడ్కర్ విగ్రహానికి నిరసన తెలియజేస్తూ వినతిపత్రం అందించారు.

నిత్యావసర సరకులు ఇవ్వాలి.. చాట్రాయి, న్యూస్‌టుడే: చౌక దుకాణాల్లో కందిపప్పు, ఇతర నిత్యావసర వస్తువులను పంపిణీ చేయాలని కోరుతూ సీపీఐ నాయకుడు కొమ్ము ఆనంద్ తహసీల్దారు దాసరి ప్రశాంతికి సోమవారం రెవెన్యూ కార్యాలయంలో వినతిపత్రం అందించారు. ఎండీయూ వాహనాలతో పూర్తి స్థాయిలో నిత్యావసర సరకులను అందిస్తే పేదలకు మేలు జరుగుతుందన్నారు.

స.హ.చట్టం సూచికలు ఏర్పాటు చేయాలి.. మండవల్లి, న్యూస్‌టుడే: ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో సమాచార హక్కు చట్టం సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని ప్రజాసామ్య పరిరక్షణ ఐక్య వేదిక జిల్లా కన్వీనర్ ఎల్ఎస్.భాస్కరరావు కోరారు. ఐక్యవేదిక ఆధ్వర్యంలో సోమవారం రెవెన్యూ కార్యాలయంలో నిర్వహించిన 'మీ-కోసం'లో తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. నాయకులు తెంటు అప్పారావు, బండి రంగారావు, శీలం షణ్ముఖరాజు, వల్లూరి రాజేశ్వరరావు పాల్గొన్నారు.

'భూములు అక్రమంగా కొనుగోలు చేస్తే ప్రతిఘటిస్తాం'.. నూజివీడు, న్యూస్‌టుడే: నూజివీడు సిద్ధార్థ నగర్‌లో గిరిజనుల సాగులో ఉన్న బంజరు భూములను ఎవరూ క్రయ, విక్రయాలు చేయొద్దని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు చలసాని వెంకట రామారావు తెలిపారు. సోమవారం సిద్ధార్థనగర్‌లో జరిగిన సాగుదారుల సర్వసభ్య సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. దొంగ పట్టాలతో పేదల భూములు ఆక్రమించకుండా ప్రతిఘటించాలని సాగుదారులు ఏకగ్రీవంగా తీర్మానించారు.

రహదారి ప్రమాదంపై కేసు.. ముదినేపల్లి, న్యూస్‌టుడే: శ్రీహరిపురం శివారు సింగరాయపాలెం పెట్రోలు బంక్ వద్ద ఆదివారం రాత్రి జరిగిన రహదారి ప్రమాదంపై సోమవారం పోలీసులు కేసు నమోదు చేశారు. గాయపడిన వణుదుర్రుకు చెందిన కోనాల కిరణ్‌కుమార్, కుమార్తెలు సరయు, అమీనా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వారి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. మృతి చెందిన కిరణ్‌కుమార్ భార్య నైనా మృతదేహానికి గుడివాడ ప్రాంతీయ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు.



కల్వర్టుల నిర్మాణానికి శంకుస్థాపన.. నూజివీడు, న్యూస్‌టుడే: నూజివీడు పట్టణంలోని 32వ వార్డులో ఆటో స్టాండ్, రజకపేట రామాలయం దగ్గర రూ.1.50 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించనున్న కల్వర్టులకు వార్డు ఇన్‌ఛార్జి, మాజీ కౌన్సిలర్ జి.దుర్గాదేవి సోమవారం శంకుస్థాపన చేశారు. ఆ ప్రాంతంలో మురుగు కాలువల వద్ద ఇబ్బంది పడుతున్నట్లు మంత్రి పార్థసారథి దృష్టికి తీసుకు వెళ్లడంతో ఆయన ఆదేశాల మేరకు కల్వర్టులు నిర్మించేందుకు మున్సిపల్ అధికారులు ముందుకు వచ్చారు. దుబ్బిరెడ్డి శ్రీను, నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.

వరద బాధితులకు చేయూత.. కైకలూరు, న్యూస్‌టుడే: ప్రజలకు ఎటువంటి కష్టం వచ్చినా నందమూరి కథనాయకులతో పాటు అభిమాన సంఘం అండగా ఉంటుందని ఆల్ ఇండియా ఎన్‌బీకే అభిమాన సంఘం అధ్యక్షుడు తిలక్ అన్నారు. నియోజకవర్గ ఎన్‌బీకే- ఎన్టీఆర్ అభిమాన సంఘం ఆధ్వర్యంలో కోమటిలంకలో వరద బాధిత కుటుంబాలకు బియ్యం, నిత్యావసర సరకులు సోమవారం పంపిణీ చేశారు. నాయకులు వేగిరెడ్డి సురేష్, ఎల్ఆర్ మోహన్, యోహన్ పాల్గొన్నారు.

ఆలయాభివృద్ధికి కృషి.. ముదినేపల్లి: లోపాలను సరిదిద్ది ఆలయాభివృద్ధికి కృషి చేయాలని ఎన్డీయే నాయకులు కోరారు. సింగరాయపాలెం- చేవూరుపాలెం సెంటరులోని వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ సహాయ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన ఆర్.గంగాశ్రీదేవిని మండలంలోని ఎన్డీయే నాయకులు కలిసి మాట్లాడారు. నాయకులు పరసా విశ్వేశ్వరరావు, కొత్తూరి విఠల్, రామకృష్ణ, ఏఎన్.బాబు, వడ్లాని ఆంజనేయులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ 15వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టు - కృష్ణా, నూజివీడు

జి.డబ్ల్యూ.ఓ.పి.నెం. 57/2024

బిట్వీన్:

గుజ్జు ధనుంజయ ... పిటీషనర్

మరియు

--- ... రెస్పాండెంట్

యిందుమూలముగా యావన్మందికి తెలియచేయునది ఏమనగా. పైన పేర్కొన్న పిటీషనర్ తన మైనర్ సంతానమైన గుజ్జు వెంకట హేమంత్, 2. గుజ్జు వెంకట హేమానంద్ మరియు గుజ్జు చాణిక్య రామ్ నరేంద్ర తాలూకు ముసునూరు మండలం, కొర్లగుంట గ్రామంలోని ఆర్.యస్.నెం. 154 దాఖలా య. 0.80 సెంట్లు మెరక భూమి మరియు డిటో గ్రామ ఆర్.యస్.నెం. 154 దాఖలా య. 0.84 సెంట్లు మెరక భూమిని విక్రయించుటకు గాను కోర్టువారిని అనుమతి కోరుచూ, పై నెంబరు పిటీషన్ దాఖలు చేసియున్నారు. యిందుకు గానూ సదరు పైన తెలిపిన ఆస్తిపై ఎవరికైననూ, ఏవిధమైన అభ్యంతరములు ఉన్ననూ శ్రీ కోర్టు వారి యెదుట ది. 01-11-2024వ తేదీ ఉదయం 10.30 గంటల నిమిషములకు స్వయముగా గానీ లేదా మీ న్యాయవాది ద్వారా గానీ హాజరు అయ్యి, అభ్యంతరములను తెలుపుకొనగలరు. ఎటువంటి అభ్యంతరములు లేని యెడల సదరు ఆస్తిని నిరభ్యంతర ఆస్తిగా పరిగణించి శ్రీ కోర్టువారు తగు ఉత్తర్వులు జారీచేయగలరు.

సం/- యన్.వంశీ
నూజివీడు — న్యాయవాది, నూజివీడు
ది. 07-10-2024 — సెల్: 96400 02400